https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 | సంచిక : 300 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | ఆదివారం 30 - 8 - 2026 | పేజీలు : 8 | వెల : రూ.1/-

## తలక్రిందులుగా తపస్సు చేసినా..

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### - మంత్రి పొంగులేటి



సూర్యాపేట, ఆగస్టు 29: ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను ఇస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్ బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలపై గుర్తించనున్నట్లు చెప్పారు. రాబోయే సంవత్సరంన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# గడువు పెంచండి..

## ఎస్ఐఆర్‌పై ఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ



**హైదరాబాద్,ఆగస్టు 29:** తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువు సెప్టెంబర్ 16తో ముగి యనున్న నేపథ్యంలో, ప్రజలకు అలాగే రాజకీయ పార్టీలకు మరింత సమయం కల్పించేందుకు ఈ గడువును పొడిగించాలని ఆయన కోరారు. 73.39 లక్షల ఎంట్రీలు ASDD కేటగిరీలో ఉన్నాయని, తాత్కాలికంగా వెళ్లినవారిని కూడా శాశ్వతంగా తరలివెళ్లినట్లుగా పరిగణించే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు. కొత్త అడ్రస్ తో నమోదు చేసుకునేందుకు ఈసీ సహాయం చేయాలని కోరారు. అలాగే నోటీసులపై స్పందించేందు కు ఓటర్లకు సమయం ఇవ్వాలని, లిస్టు నుంచి అర్హులైన ఓటర్లు తొల గిపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐ ఆర్ స్థాయిలో సిబ్బందిని మరింత పెంచాలని కోరారు. రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను మరింత పక్కాగా పూర్తి చేసేందుకు ఈ సమయం ఎంతో ఉపయోగపడుతుందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్ర మానికి తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం అన్నివిధాలుగా పూర్తి సహకారం అందిస్తుం దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా

# 'సంజీవని' అమలు: చంద్రబాబు



**అమరావతి,ఆగస్టు 29:** రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉ ద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గ తంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీ య విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య


### - సూర్యాపేట జిల్లా ఎర్రగడ్డ తండాలో విషాదం- గొడ్డళ్లతో దాడులు చేసుకున్న రెండు వర్గాలు- అడ్డుకునేందుకు యత్నించిన ఎస్సై నవీన్ కుమార్ కి గాయాలు



సూర్యాపేట:సూర్యాపేట జిల్లాలో ఓ చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన చిచ్చు... దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

ఈ దాడిలో గొడ్డలి వేట్లకు గురైన ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతో పాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో... ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



హైదరాబాద్ : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలి పారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉ త్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

# 22ఏ భూముల సమస్యలపై పోరుబాట

## బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాంచందర్ రావు కీలక భేటీ



**హైదరాబాద్,ఆగస్టు 29:** తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీనిబలోపేతం చేసుకునే దిశగాబీజేపీ ముందుకు సాగు తోంది. ఇటీవలవిద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## హైదరాబాద్‌లో గంజాయి

# చాక్లెట్ల కలకలం.. నిందితుడి అరెస్ట్



హైదరాబాద్, ఆగస్టు 29: నగరంలోని శామీర్‌పేట్‌లో భారీగా గంజాయి చాక్లెట్లు పట్టుపడటం కలకలం రేపింది. యువత, చిన్నారులే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి భారీఎత్తున గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన బైద్‌నాథ్, అతడి భార్య పూజారి కొంతకాలంగా శామీర్‌పేట్‌లో నివసిస్తున్నారు. వారు ఓ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి అలవాటుపడిన వారు.. గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. పాన్‌షాప్ ముసుగులో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. సదరు షాప్‌పై దాడి చేశారు. బైద్‌నాథ్‌ను అరెస్ట్ చేసి 25 కేజీల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అతడి భార్య కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు పాఠశాలలు, కాలేజీల వద్ద నిఘా పెంచారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కొనుగోలు చేసే ఆహార పదార్థాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.

## ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీడ్రాలో ప్రోటోకాల్ రగడ..

# అధికారులపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం

### - దానం రాకముందే లక్కీడ్రా ప్రారంభించిన అధికారులు -ప్రోటోకాల్ ప్రారంభించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారన్న దానం -బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



**హైదరాబాద్,ఆగస్టు 29:** ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ/ గృహలక్ష్మి ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వజమెత్తారు. తాను రాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రారంభించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన రాకముందే అధికారులు ప్రక్రియను ప్రారంభించడం తో తీవ్ర అసంతృప్తికి గురైన దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు. ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా, ప్రోటోకాల్ పాటించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని దానం నిలదీశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అలిగి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతం లోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన

-రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలి... -టిజీఈ జేఏసీ ఆధ్వర్యంలో కృష్ణా మండల కేంద్రంలో...




నారాయణపేట,(డీకే చాటింపు): టిజీఈ జేఏసీ తెలంగాణ రాష్ట్ర సంఘ పిలుపుమేరకు శనివారం కృష్ణా మండలంలో ఉద్యోగ,ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పిఆర్సి,డిఏలు ప్రకటించడం లేదని ధ్వజమెత్యాలు.మేనిఫెస్టోలో పెట్టిన సిపిఎస్ రద్దు 317 జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు నేటికీ న్యాయం చేయకపోవడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు నెలలు కావచ్చునా నేటికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమును సరిగ్గా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ కృష్ణా మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నేతలు వై.జనార్ధన్ రెడ్డి,రాంగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సి,డిఏల ప్రకటన చేయాలని,సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా జేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్, పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్దన్ రెడ్డి,జేఏసీ కో చైర్మన్ ,ఎస్టియు జిల్లా అధ్యక్షులు రామ్ గోపాల్,రెవిన్యూ ఉద్యోగసంఘం నాయకులు శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శులు మహేష్,రాజు, పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరేందర్,బాలరాజు, మాగనూర్ మండల అధ్యక్షులు బలరాం,కృష్ణా మండల ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్,గౌరవ అధ్యక్షులు శివరాజ్, అసోసియేట్ అధ్యక్షులు అనిల్ కుమార్,తాయప్ప, డిటిఎఫ్ నేతలు అశోక్, నర్సింహా,శంక్రప్ప,వీరేష్, సహీన్,లక్ష్మీదేవి,రంగారావు, గీత,షబానా,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పిఎంపి,ఆర్ఎంపీలను గుర్తించాలి

సీఎం కు రాష్ట్ర అధ్యక్షుని విన్నపం






నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 29(డీకే చాటింపు): గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉంది ప్రజల్లో ఒకరిగా మన్ననలు పొందుతూ ప్రథమ చికిత్స అందిస్తూ గ్రామీణ ఆరోగ్య భారతంగా గ్రామీణ ఆరోగ్య తెలంగాణ తీర్చిదిద్దుటలో తమ వంతు సహకారాన్ని అందిస్తున్న పిఎంపి ఆర్ఎంపీలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇప్పించి ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్ అందజేయాలని రాష్ట్ర పీఎంపి,ఆర్ఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు సమాఖ్య ప్రధాన కార్యదర్శి పులగం మోహన్ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. నిజామాబాద్ లోని ఈఎంపిఆర్ఎంపి అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ గత సీఎంలు వైయస్ రాజశేఖర్ రెడ్డి కె చంద్రశేఖర రావు లు తమను గుర్తించి శిక్షణ ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లుగా చేస్తామని జీవో నెంబర్2317/2009 అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. మేనిఫెస్టో ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపి,పిఎంపీలను వెంటనే వైద్య ఆరోగ్యశాఖ ద్వారా గుర్తించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గతంలో ఏర్పరిచిన అడ్వైజరీ కమిటీ సూచనల మేరకు ఆర్ఎంపిఎంపి లకు 1000 గంటల శిక్షణ ఇచ్చి గుర్తించి ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దాలని ఇందులో మమ్ములను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ జీవో ప్రకారం శిక్షణ పొందటానికి సుమారు 36 వేల మంది ఆర్ఎంపీ ఎంపీలు చలాన్లు కూడా కట్టారని గుర్తు చేశారు. ఒక సంవత్సరం 13 13 వేల మంది ఆర్ఎంపి,పిఎం పి లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. శిక్షణ పొందిన వారికి వెంటనే సర్టిఫికెట్లు జారీ చేయించాలని, వెయ్యి గంటల శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేయాలని ముఖ్యమంత్రిని, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. 2008 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్సార్ 14 మందితో కూడిన అడ్వైజరీ కమిటీని జీవో నెంబర్ 429 జారీ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున వేలాదిమంది పీఎంపి,ఆర్ఎంపీలు సీఎంపై ఆశలు పెట్టుకున్నారని,గ్రామీణ వైద్యం ప్రజలకు అందించుటలో ముందుంటామని ఇది గుర్తించి వెంటనే వైద్యారోగ్య శాఖ ద్వారా తగు చర్యలు తీసుకొని అమలు చేయాలని కోరారు.గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ శివార్లలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తూ ఫస్ట్ ఎయిడ్ నిర్వహిస్తున్న ఆర్ఎంపి పిఎంపి లపై ఎస్ఓటి పోలీసులు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులను నిలిపివేయాలని ముఖ్యమంత్రి,ఆరోగ్య శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. సమాజంలో మేము అంతర్భాగమే కానీ ఎవరికి హాని చేసే పనులు చేయమని నిబంధనల మేరకే నడుచుకుంటూ రిస్క్ కేసులు ఉంటే క్వాలిఫైడ్ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రులకు పేషంట్లకు మార్గదర్శనం చేస్తున్నామన్నారు. ఎవరో ఒకరు ఎక్కడో ఒకచోట తప్పులు చేస్తే వేలాదిమంది పి ఎంపీలు ఆర్ఎంపీ లపై వివక్ష చూపడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు.

# నేత్రదానంతో కంటి చూపు...

## తిలక్ వాకర్స్ ఆధ్వర్యంలో నేత్రదాన కార్యక్రమం....



బెల్లంపల్లి (డీకే చాటింపు )తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బెల్లంపల్లి వారి ఆధ్వర్యంలో శనివారం నేత్రదానం నిర్వహించారు. పట్టణం లోని భూంపల్లి రాజేశ్వరరావు అమ్మ (83) నీల అనారోగ్యంతో కన్నుమూశారు.దుఃఖంలో ఉన్న వీరు తిలక్ వాకర్స్ అసోసియేషన్ వారు నేత్రదానం ఎంత గొప్పదో మరొకరికి చూపులు ఇవ్వడం అనేది సమాజంలో సహాయం చేయడం ఎంతో గొప్ప విషయం ఎంతో బాధలో ఉన్నప్పటికీ నేత్రదానానికి అంగీకరించటం గోదావరిఖని నుంచి టెక్నీషన్ ప్రదీప్ వచ్చి నేత్రదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు.రంగ రామన్న, కజ్జం రమేష్,లింగాల రాజేశం, నాగుల లింగయ్య శ్రీనివాసరాజు, రాజేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ గూటికి మేకపాటి ఫ్యామిలీ

**నెల్లూరు,** :తెలుగుదేశం పార్టీలో మళ్లీ చేరికలు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు టిడిపి తో పాటు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే సరైన సమయం కోసం వేచి చూస్తూ వస్తోంది టీడీపీ. అవసరం అనుకున్న క్రమంలో ఒక్కో నేత చేరిక ఉండాలని భావించింది. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక బలమైన కుటుంబాన్ని టిడిపిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు పూర్తయినట్లు సమాచారం. త్వరలో ఆ బలమైన ఫ్యామిలీ టిడిపిలోకి రావడం ఖాయం అని తెలిపోయింది. దానిపైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.గత కొన్ని రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అంటి ముట్టనట్టుగా ఉంది మేకపాటి ఫ్యామిలీ. రాజకీయాలపై కాకుండా వ్యాపారాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. రాజకీయంగా మనసు మారింది అని ఆ ఫ్యామిలీ పై ఒక ప్రచారం ఉంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఆది నుంచి మేకపాటి ఫ్యామిలీ వ్యాపార రంగంలో స్థిరపడింది. కూటమి వచ్చిన తర్వాత ఆ ఫ్యామిలీ పై ఎటువంటి వివాదాలు కానీ కేసులు కానీ లేవు. వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ వైసీపీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆవేదనతో ఉన్నారు మేకపాటి రాజమోహన్ రెడ్డి. ఈ క్రమంలోనే జగన్ చుట్టూ ఉన్న కోటరీ మారాలని.. జగన్ వైఖరిలో మార్పు రావాలని కామెంట్స్ చేశారు మేకపాటి. అప్పటినుంచి ఆయన పార్టీ మారుతారు అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. మధ్యలో ఆ ప్రచారానికి పడింది కానీ ఇప్పుడు మళ్లీ మొదలైంది.మేకపాటి రాజమోహన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి సన్నిహిత నేత. ఆ అభిమానంతోనే ఎంపీ పదవి విడిచిపెట్టి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్మోహన్ రెడ్డి సైతం ఎంతగానో అభిమానం చూపారు ఆ కుటుంబం పై. మేకపాటి గౌతం రెడ్డికి క్యాబినెట్ మంత్రి పదవి ఇచ్చారు. కానీ ఆయన అకాల మరణం చెందారు. తర్వాత మేకపాటి విక్రమ్ రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. అంతకుమించి ఏ అవకాశం ఇవ్వలేదు ఆ ఫ్యామిలీకి. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు నుంచి బలమైన నేతలు దూరం కావడంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్లు ఇచ్చారు

# మూగబోయిన ఫైర్ బ్రాండ్స్



**విజయవాడ,** :2024 ఎన్నికల ఓటమి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. గతంలో ప్రత్యర్థిపార్టీల నేతలపై నిమిషానికో రీతిలో విరుచుకుపడే ఫైర్ బ్రాండ్ నాయకులు ఆర్.కే. రోజా, కొడాలి నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ వంటి కీలక నేతలు రాజకీయంగా పూర్తిగా మౌనం వహించారు. ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటిపోయినా వీరు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనకపోవడం, మీడియా ముందుకు రాకపోవడం కేడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. ప్రస్తుతం కేవలం పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి కొద్దిమంది నాయకులు మాత్రమే మైకుల ముందుకు వచ్చి ప్రత్యర్థులపై ఎదురుదాడి చేస్తున్నారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదైన వరుస కేసులు, చట్టపరమైన చర్యల భయంతో స్లో అయ్యారు. జోగి రమేష్ పై సిఐడి కేసులు, అగ్రిగోల్డ్ భూ వివాదం, తాజాగా కుటుంబం కేసులు కూడా వచ్చి పడ్డాయి. అలాగే వల్లభనేని వంశీ చాలా రోజులు జైల్లో ఉండి వచ్చారు. కొడాలి నాని అనారోగ్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలు గుడివాడలోనే కనిపించడంలేదు. ఐదేళ్ల పాలనలో వ్యక్తిగత దూషణలతో తీవ్ర స్థాయి విమర్శలు చేసిన ఈ నేతలు, ఇప్పుడు అధికార పక్షం కఠినంగా వ్యవహరిస్తుండటంతో చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకునేందుకు తాత్కాలికంగా రక్షణాత్మక వైఖరి లోకి వెళ్లిపోయారనేది స్పష్టమవుతోంది.మరోవైపు, ప్రతిపక్షంలో ఉన్న ఈ సమయంలో తీవ్రంగా విరుచుకుపడే నాయకులు మీడియా ముందు రాకపోతే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రాదనేది పక్కా వాస్తవం. జగన్ మోహన్ రెడ్డి సైతం క్షేత్రస్థాయికి వచ్చి నిరసనలకు పిలుపునిస్తున్నా, దూకుడైన నేతల నాయకత్వం లేకపోవడం వల్ల ఆందోళనలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నాయి. పేర్ని నాని, అంబటి రాంబాబులు ఒంటరి పోరాటం చేస్తున్నప్పటికీ, రాయలసీమ నుంచి రోజా, కృష్ణా జిల్లా నుంచి కొడాలి నాని, వంశీ, జోగి రమేష్ వంటి వారు జతకలిస్తేనే పార్టీ కేడర్‌లో పూర్వ వైభవం, మైలేజ్ లభిస్తాయని వైఎస్సార్సీపీ శ్రేణులు భావిస్తున్నాయి.అయితే, వీళ్లను జగన్ ఎప్పుడు యాక్టివ్ చేస్తారు? లేదా వారే స్వయంగా బయటకు వస్తారా? అనే ప్రశ్నలకు పార్టీ వ్యూహకర్తల నుంచి భిన్నమైన సమాధానాలు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్నప్పుడు చేసిన విమర్శల వల్లే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని భావిస్తున్న జగన్, ప్రస్తుతానికి కొత్త డెసిషన్ తీసుకునే ముందు కొంత సమయం ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వం విధించే చట్టపరమైన సవాళ్లు , కేసుల తీవ్రత కొంత తగ్గిన తర్వాతే లేదా స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి వీరిని మళ్లీ ముందువరుసలోకి తెచ్చేలా వ్యూహం రచిస్తున్నారని సమాచారం. అందుకే వారు వారి వారి నియోజకవర్గాల్లో పెద్దగా పార్టీ వ్యవహారాలను పట్టించుకోకపోయినా .. లైట్ తీసుకుంటున్నారని అంటున్నారు.వైఎస్సార్సీపీ తిరిగి పుంజుకోవాలంటే కేవలం జగన్ ఓరల్ ప్రసంగాలు సరిపోవు. క్షేత్రస్థాయిలో కౌంటర్ ఇవ్వగలిగే బలమైన గొంతులు మళ్లీ ప్రజా క్షేత్రంలోకి రావడం అత్యంత అవసరం. ఈ నేతలు తమ వ్యక్తిగత, న్యాయపరమైన సవాళ్లను దాటుకుని ధైర్యంగా ముందుకు వస్తే తప్ప వైఎస్సార్సీపీ కేడర్‌లో కోల్పోయిన ఆత్మవిశ్వాసం తిరిగొచ్చే అవకాశం లేదు. మరి దానికి జగన్ ఏం చేయబోతున్నారో

# ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్...




**విజయవాడ,** : రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు.పైకి కనిపించే ఈ ప్రశంసలు వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం.ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు.మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు-లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్ కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

# కేసుల్లో నేతలు... కిం కర్తవ్యం



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, కీలక నేతలు వరుసగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ముందస్తు బెయిళ్ల కోసం హైకోర్టు మెట్లు ఎక్కడం లేదా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూకబ్జా, డెత్ సర్టిఫికెట్ల ఫోర్జరీ కేసుల విచారణ నెదుర్కొనడం, గుంటూరు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కిడ్నాప్ వివాదంలో చిక్కుకోవడం, మహిళా ఎస్ఐపై దౌర్జన్యం ఆరోపణలతో ఆముదాలవలస ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడం వంటి వరుస ఘటనలు విపక్షాన్ని తీవ్ర ఆత్మరక్షణలో పడేశాయి.ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. ఆర్కే రోజా, కైలే అనిల్ కుమార్, విశ్వేశ్వర్ రెడ్డి వంటి కీలక నాయకులు సైతం రకరకాల క్రిమినల్ కేసులు, అరెస్టు భయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ నేతలను భయాందోళనకు గురిచేసేందుకే పోలీసులు, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయితే, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసులు ఎక్కువగా రాజకీయాలకు సంబంధం లేనివి. భూక్రమబద్ధీకరణ పత్రాల ఫోర్జరీ, బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం , సివిల్ తగాదాల్లో అపహరణలు , ఆన్-డ్యూటీ మహిళా పోలీసులపై భౌతిక దౌర్జన్యాలు వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ క్రిమినల్ కేసులు .గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకులు, ప్రభుత్వం మారిన తర్వాత కూడా తమ పాత ధోరణినే కొనసాగించడం. స్థానిక అధికార యంత్రాంగంపై భౌతిక దాడికి దిగడం లేదా చట్టవ్యతిరేక భూ లావాదేవీలలో భాగస్వాములు కావడం ద్వారా స్వయంగా కూటమి ప్రభుత్వానికి లీగల్ ఆధారాలను అందించి ఉచ్చులో చిక్కుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే సమయంలో సానుభూతి కోసం వైఎస్సార్‌సీపీ ఎంచుకున్న వ్యూహాత్మక రాజకీయ బాధితులుగా నిలిచే స్ట్రాటజీ కూడా కావొచ్చని భావిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం కావాలనే కేసులు పెడుతోందని ప్రజల్లో చూపించుకోవడం ద్వారా రాజకీయంగా మైలేజ్ పొందే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. అయితే, సివిల్ వివాదాలు, వ్యక్తిగత క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో ఈ పొలిటికల్ విక్టిమ్ కార్డ్ సరిగ్గా పనిచేయదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజలు భూకబ్జాలు, కిడ్నాప్ కేసులను పొలిటికల్ వెండెట్టాగా చూడటానికి సిద్ధంగా లేకపోవడమే వైఎస్సార్‌సీపీ నరేటివ్‌కు అతిపెద్ద అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఈ వరుస అరెస్టులు, ముందస్తు బెయిళ్ల కొట్టివేత పరిణామాలు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నియోజకవర్గ స్థాయిలో నడిపించే ప్రధాన నాయకులే రోజులు, వారాల తరబడి అజ్ఞాతంలోకి వెళ్లడం లేదా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో స్థానిక శ్రేణుల్లో నాయకత్వ శూన్యత ఏర్పడుతోంది.

డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
ఆదివారం 30 - 8 - 2026

# ఇది ఉద్వేగం కాదు.. మనిషిలో దాగిన క్రూరత్వం!

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు కేవలం చట్టపరమైన సమస్యలు మాత్రమే కావు. ఈ నేరాల వెనుక దాగి ఉన్న క్రూర మనస్తత్వం, సామాజిక వైఫల్యాలు, నైతిక సంక్షోభం గురించి విశ్లేషించే కథనం. చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, వాటి తర్వాత వెలుగులోకి వస్తున్న అమానుష హింస, హత్యలు సమాజాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి. ప్రతి సంఘటన తర్వాత ఒకే రకమైన ఆవేదన వ్యక్తమవుతోంది. కొవ్వొత్తుల ర్యాలీలు జరుగుతున్నాయి. న్యాయం కోసం నినాదాలు వినిపిస్తున్నాయి. కఠిన శిక్షల కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి. కానీ ఈ ఆగ్రహం, దుఃఖం , ఆందోళనలు, మానసిక సంఘర్షణలు అసలు మూలాన్ని వెతకడంలో అలసిపోతున్నాయి . ఇలాంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల మానసిక ప్రవృత్తి ఏమిటి? అది ఒక్క క్షణపు ఉద్వేగమా? లేక వారి వ్యక్తిత్వంలోనే దాగి ఉన్న ఏదైనా చీకటా? లేదా వారి జీవితం, వారి స్వతః సిద్ధ మానసిక కోణం ఇలాంటప్పుడే బయటపడుతోందా!? ఇన్నాళ్లు మనం దానిని ఇగ్నోర్ చేశామా? ఇవే ఆ మూలాలు.. ఇలాంటి నేరాలు జరగగానే ఆ క్రూరుడిని ఒక గాటన కట్టేస్తాం "అదుపు తప్పిన కోరిక", "క్షణిక ఉద్వేగం", "ఆవేశం" వంటి అనేక పొరల మాటున అతను చేసిన గాయాన్ని మర్చిపోతున్నాం. కానీ వయసుతో సంబంధం లేకుండా, పరిస్థితుల అంశం లేశ్యమాత్రమైనా లేకుండా చిన్నారులపై, మహిళలపై, జరిగే అత్యాచారాలను, వాటి తర్వాత జరిగే హత్యలను పరిశీలించినప్పుడు ఇవన్నీ అసంపూర్ణాలు కదా!. అవును ఒకవేళ అది నిజంగానే ఒక్క క్షణపు ఉద్వేగమే అయితే, ఆ దారుణ కృత్యానికి ముందూ, వెనుకా కనిపించే పాశవిక హింస సంగతి ఏమిటి? చిన్నారి భయాన్ని చూస్తూ, చిన్నారి లేదా ఆమె అసహాయతను గమనిస్తూ, ఆ బాధను గ్రహిస్తూ కూడా తనను తాను మనిషిగా మరచిపోయి మృగత్వాన్ని కొనసాగించడం ఏ రకపు ఉద్వేగం? తన తనకాలమాన పరిస్థితులు, తన సోషల్ స్టేటస్, అందులో తాను అప్పటివరకూ పొందిన పేరు అన్నీ వదిలేసి కేవలం తన పశుత్వాన్ని మాత్రమే తాను నిరూపించుకోవడానికి సిద్ధపడటం ఏమిటి !

పోనీ నేరం జరిగిన తర్వాత అయినా తనను తాను గుర్తిస్తున్నారా? హత్యలకూ దిగుతున్నారు అదీ అత్యంత కర్కశంగా.. ఎవిడెన్స్‌ను చెరిపేయడానికి తొక్కకూడని దారులు తొక్కుతూ ఒక తప్పుకు వంద తప్పులు చేస్తూ పోతున్నారు? బయటపడతాననే భయంతో బాధితులకు ఇంకా ఇంకా నరకం చూపెడుతున్నారు. అసలిక్కడి వాస్తవం క్షణిక ఉద్వేగం కాదు. అతని లోపలి ఎన్నో రోజుల క్రూరత్వం. ఒక చిన్నారి కన్నీళ్ల కంటే తన కోరిక పెద్దదిగా కనిపిస్తోంది, ఒక చిన్నారి ప్రాణం కంటే తన రక్షణ ముఖ్యమైపోతోంది, ఎదుటివారి బాధను గుర్తించలేని నైతిక పతనం ఇది. ఒక మనిషి మరొక మనిషిని మనిషిగా చూడలేని స్థితి ఇది. సైకాలజీ దీనిని మానవత్వాన్ని హరించడంగా నిర్వచిస్తుంది. అంటే ఎదుటివారి వ్యక్తిత్వం, హక్కులు, బాధ అన్నీ అదృశ్యమై, అతను లేదా ఆమె కేవలం ఒక వస్తువుగా మారిపోవడం, తన ఆనందం, తన మానసిక వికారం తీర్చుకోవడానికి వారు ఒక ఆటబొమ్మగా వీరి దృష్టికి కనిపించడం. పోనీ ఇది క్షణకాలపు ఉద్వేగం కాదు, ఇది వారి వ్యక్తిత్వంలో భాగమే అనుకుంటే, అటువంటి వ్యక్తులను మనం ఎలా గుర్తించాలి? ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఇలాంటి నేరాలు చేసే వారు మనకేం రాక్షసుల్లా కనిపించరు. వారి ముఖాలపై క్రూరత్వం రాసి ఉండదు. వారు కుటుంబ సభ్యులుగా, బంధువులుగా, పొరుగువారిగా, సహోద్యోగులుగా, కొన్నిసార్లు సమాజంలో అత్యంత గౌరవనీయులుగా కూడా ఉంటారు."అతను అలాంటి వాడని అనుకోలేదు." అనేంత మంచివాడిగా మన మధ్య తిరుగుతూ మనతోనే జీవిస్తుంటారు. ఇదే ఇప్పటి సమాజం ఎదుర్కొంటున్న అసలైన సవాలు, ఒకానొక చీకటిని గురించిన భయం. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు. మనుషులను అర్థం చేసుకునే మన సామర్థ్యపు సమస్య, విలువల సమస్య.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

## నీట్ (పీజీ) పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను

# పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 29 (డీకే చాటింపు) : నీట్(పీ.జీ) పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో నీట్(పీ.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, అర్సపల్లిలోని ఏ.వీ ఎంటర్ ప్రైజెస్. మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్ లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి నిశిత పరిశీలన జరిపారు. పరీక్షా కేంద్రాల్లో సరిపడా కంపూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు,వైద్యసదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.

లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోండి

నీట్(పీ.జీ)పరీక్షనిర్వహణలో ఎలాంటి తప్పిదాలు, లోటు పాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నీట్(పీ.జీ) పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఐ.ఈ.ఓ రవికుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, ఏ.సీ.పీ ప్రకాశ్, తహసిల్దార్లు వినయ్ కుమార్, హరికిషోర్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు ఉన్నారు.

# బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్





నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 29 (డీకే చాటింపు): మోపాల్ మండలం బోర్గాం(పి) గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందు బాటులో ఉన్న బోధనా సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వపాఠశాల లతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1120 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించడం పట్ల కలెక్టర్ హర్షం వెలిబుచ్చారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపడంతో, స్కూల్ కు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలని, దీనివల్ల పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతిని సందర్శించి విద్యార్థిని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టులను బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థిని, విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడులలో నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి. చేయాలని సూచించారు. పిల్లలను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా బయటి ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా కల్పించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, మోపాల్ తహసిల్దార్ రేఖ, ఎం.ఈ.ఓ సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

## శ్రావణమాసం..విశిష్ట మాసం

# మూడోవ శనివారం ప్రత్యేకం

### -ఉపవాస దీక్షలతో భక్తులు.. -దేవాలయాల్లో ప్రత్యేక పూజలు... - మొక్కుబడులు చెల్లించుకున్న భక్తులు...





నారాయణపేట,(డీకే చాటింపు): శ్రావణమాసం మూడోవ శనివారం పురస్కరించుకొని నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో భక్తుల సందడి నెలకొంది.శ్రావణ మాసంలో వచ్చే మూడవ శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి, శనిదేవుడు,హనుమంతుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం చాలా విశేషం.ఈ రోజున చేసే పూజల ద్వారా సకల ఐశ్వర్యాలు, కుటుంబ శాంతి కలుగుతాయని భక్తుల విశ్వాసం.ఉదయమే లేచి తలస్నానం చేసి,శుభ్రమైన వస్త్రాలను ధరించి పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. శ్రావణ మాసం ఈనెల12 (బుధవారం)నుంచి ప్రారంభమైన విషయం పాఠకులకు విధితమే. సెప్టెంబర్11(శుక్రవారం) వరకు శ్రావణ మాసం కొనసాగుతుంది.ఈ శ్రావణ మాసంలో నాలుగు శనివారాలు,నాలుగు సోమవారాలు వచ్చాయి. రెండో,మూడోవ సోమ వారాల్లో భక్తులు నర్సప్పను కొల్చారు.మూడవ శనివారం భక్తులు వివిధ దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణ మాసంలో భక్తులు భక్తి శ్రద్ధలతో వివిధ దేవుళ్ళను కొలుస్తుంటారు. అందులో భాగంగానే మూడోవ శనివారం పురస్కరించుకొని చాలా మంది భక్తులు తమ ఇంటి ఇలవేల్పుతో పాటు వివిధ దేవాలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.వచ్చే శ్రావణమాసం వరకు తమ కుటుంబాని చల్లగా చూడాలని ఆయా దేవుళ్లను భక్తులు కొలిచారు.ఈనెల రోజుల పాటు భక్తులు మందు,మాంసం,పుండి కూర వంటకాలకు దూరంగా ఉన్నారు.మరి కొందరు శని, సోమవారాల్లో ఉపవాస దీక్షలను పాటిస్తున్నారు. ఏడాది కాలంలో శ్రావణమాసంలో ఈనెల రోజుల పాటు భక్తులు భక్తిశ్రద్ధలతో వి అనవాయితీ.నారాయణపేట మండలం సింగారం గ్రామంలో శ్రీ చింతల రాయ స్వామిని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణపేట మండలం శేర్నపల్లి గ్రామ సమీపంలోని పల్లెగుట్ట ఆంజనేయ స్వామి, శ్యాసన్ పల్లి-సింగారం గ్రామాల మధ్యలో ఉన్న చెన్న రాయుడు స్వామి నిన్నదిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అన్ని దేవాలయాల్లో భక్తుల సందడి కానవచ్చింది.





# ఆకు పూజలతో అలరిస్తున్న హనుమాన్ దేవాలయాలు



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 29 (డీకే చాటింపు): శ్రావణ మాసం మంగళవారం ఆకు పూజలతో ఆంజనేయ స్వామిని పూజిస్తే కోరిన కోరికలు ,ఇతి బాధలు తీరుతాయని భక్తులు నమ్మకంతో ఆలయంలో పూజలు చేస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని రోకడియా హనుమాన్ మందిర్ ,సి ఎస్ కాలనీ హనుమాన్ మందిర్ ,నల్ల హనుమాన్ మందిర్, సారంగపూర్ లో వెలసిన ఆంజనేయ స్వామి టెంపుల్, కోటగిరి లో స్వయంభు వీర హనుమాన్ మందిరం, కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర బార్డర్ లో ఉన్న సలాబత్పూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈరోజు ఘనంగా తమలపాకుల దండలతో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. ఈరోజు ఆకు పూజలు చేయడం ద్వారా ఆంజనేయస్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉంటాయని ప్రధాన పూజారి ప్రవీణ్ పంతులు శ్రీనివాస్ పంతులు రాహుల్ పంతులు తెలియజేశారు.

# రసా భాసగా మారిన కామారెడ్డి మున్సిపల్ సమావేశం



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 29 (డీకే చాటింపు):కామారెడ్డి మున్సిపాలిటీ పాలకమండలి సమావేశం శనివారం ఉదయం చైర్మన్ ఇప్ప ఉమారాణి అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభం రాగానే కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి కౌన్సిలర్లు నిరసన తెలుపుతూ పోడియం వద్ద బైటాయించారు. తమ వార్డుల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సమాచారం లేకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా వాగ్వివాదానికి దిగారు. గత సంవత్సరం వచ్చిన వరదలతో కామారెడ్డి అతలాకుతలమైందని ఇంతవరకు ఒక్క రూపాయి కూడా సీఎం నిధులు విడుదల చేయలేదని బిజెపి కౌన్సిలర్లు ఆరోపించగా, మీ ఎమ్మెల్యే ఒక్క అభివృద్ధి పనైనా కామారెడ్డికి ఇచ్చారా అని కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. గందరగోళం మధ్య శ్రీ వర్గాలను శాంతింపజేసిన అడిషనల్ కలెక్టర్ సమావేశాన్ని సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అడిషనల్ కలెక్టర్ అదేవిధంగా వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్లు పాల్గొన్నారు.

# సివిల్ డిపార్ట్మెంట్ టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీగా పుల్లూరి మోహన్....



బెల్లంపల్లి(డీకే చాటింపు )బెల్లంపల్లి సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్‌లో టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీగా పుల్లూరి మోహన్ రావు నియమితుల య్యారు. ఈ సందర్భంగా నూతన ఫిట్ సెక్రటరీ పుల్లూరి మోహన్ రావుని మాజీ ఎమ్మెల్యే దురం చిన్నయ్య శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పుల్లూరి మోహన్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు

### ప్రజలు తమ వినతులతో కలెక్టరేట్‌కు రావద్దు :జిల్లా కలెక్టర్

జనగామ ఆగస్టు 29డీకే చాటింపు జిల్లా ప్రతినిధి జనగామ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం (ఆగస్టు 31)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహబూబాబాద్ లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.

# ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై కేంద్రం లిఖితపూర్వక హామీ ఇవ్వలేదు: సిజెపి




**న్యూఢిల్లీ :** విద్యార్థులు,ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవడంతో పాటు, భవిష్యత్తులో శాంతియుత నిరసనల్లో పాల్గొనే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు లిఖితపూర్వక హామీ ఇవ్వలేదని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) పేర్కొంది. సిజెపి ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్ మంగళవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల ఆహ్వానం మేరకు వారితో సమావేశమైనట్లు తెలిపారు. సమావేశంలో దేశవ్యాప్తంగా విద్యార్థి నిరసనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించిన అంశంపై విస్తృతంగా చర్చించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తమకు సుప్రీంకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను, ముఖ్యంగా 'డైరెక్షన్ నంబర్?4'ను చూపించిందని దాస్ తెలిపారు. ప్రస్తుతం నమోదైన ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తు కొనసాగించేందుకు సుప్రీంకోర్టు అనుమతించిన నేపథ్యంలో, ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున లిఖితపూర్వక హామీ ఇవ్వడం సాధ్యం కాదని కేంద్రం పేర్కొన్నట్లు వెల్లడించారు. అయితే, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై స్పష్టమైన లిఖితపూర్వక హామీ ఇవ్వాలని తాము ప్రభుత్వాన్ని కోరినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదని దాస్ తెలిపారు. ఈ అంశం కేవలం ఢిల్లీకి మాత్రమే కాకుండా, బీజేపీ లేదా ఎన్‌డీఏ పాలిత అన్ని రాష్ట్రాలకు వర్తించేలా హామీ ఇవ్వాలని తాము కోరినట్లు చెప్పారు. దేశ యువత ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని సౌరవ్ దాస్ విమర్శించారు. లిఖితపూర్వక హామీ ఇవ్వాలని వరకు గడువు విధించినప్పటికీ, ప్రభుత్వం స్పందించలేదని ఆయన అన్నారు. సిజెపి డిమాండ్లకు విరుద్ధంగా తీసుకునే ఎలాంటి నిర్ణయాన్నీ తమ పార్టీ అంగీకరించదని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కేంద్రం తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైతే, దేశవ్యాప్తంగా మరో విడత ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు తమ పార్టీ కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# 2027 జనాభా లెక్కల్లో కుల గణనపై
## కేంద్రం వైఖరిని ప్రశ్నించిన జైరాం రమేష్....



న్యూఢిల్లీ : 2027 జనాభా లెక్కల్లో కులానికి సంబంధించిన వివరాలను సేకరించే విధానం "ఉద్దేశపూర్వకంగానే లోపభూయిష్టంగా" ఉందని కాంగ్రెస్ కమ్యూనికేషన్ విభాగం ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విమర్శించారు. ఈ విధానం వెనుక "లోతైన దురుద్దేశం" ఉందని బుధవారం ఆరోపించారు. గతంలో ఎన్నడూ అడగని విధంగా మతం, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల జన్మస్థలం వంటి వివరాలను సేకరించనున్నారని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల్లో తల్లిదండ్రుల మతం, పుట్టిన తేదీ, జన్మస్థలానికి సంబంధించిన వివరాలను గ్రామ స్థాయి వరకు సేకరించనున్నట్లు పేర్కొన్న మీడియా కథనాన్ని జైరాం రమేష్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. జనాభా లెక్కల ప్రశ్నావళిలో కులాన్ని ప్రకటించేందుకు ఓపెన్ ఫీల్డ్ ఆప్షన్‌తో పాటు, "కులాన్ని ప్రకటించదలచుకోలేదు", "కులం లేదు" అనే ఎంపికలు కూడా ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది. కుల గణనను అడ్డుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ మంగళవారం విమర్శించింది. 2027 జనాభా లెక్కల్లో కులాల ఎంపిక కోసం 'డ్రాప్‌డౌన్ మెనూ'ను ఎందుకు చేర్చలేదని ఆ పార్టీ ప్రశ్నించింది. 2021 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం స్వయంగా ఈ విధానాన్ని సిఫార్సు చేసిందని జైరాం రమేష్ గుర్తుచేశారు. 2025 ఏప్రిల్ 30న కుల గణన నిర్వహించనున్నట్లు ప్రకటించడం ద్వారా ప్రధాని మోడీ "పూర్తిగా యూ-టర్న్" తీసుకున్నారని, ఇప్పుడు అదే నిర్ణయంపై మరోసారి యూ-టర్న్ తీసుకుంటున్నారని కాంగ్రెస్ విమర్శించింది. 2021 సెప్టెంబర్ 21న సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కుల గణన నిర్వహించాలన్న డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం తిరస్కరించిందని జైరాం రమేష్ పేర్కొన్నారు. అయితే, అదే అఫిడవిట్‌లోని 12(డి) పేరాలో కులాల నమోదుకు ముందుగా రిజిస్ట్రీని సిద్ధం చేయలేదని, కులాల ఎంపికకు 'డ్రాప్‌డౌన్ మెనూ' ఉంటే విశ్వసనీయమైన, స్థిరమైన సమాచారం లభించే అవకాశం ఉండేదని కేంద్రం పేర్కొందని తెలిపారు. "2021లో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో మోడీ ప్రభుత్వం స్వయంగా సిఫార్సు చేసిన 'డ్రాప్‌డౌన్ మెనూ' విధానాన్ని 2027 జనాభా లెక్కల ప్రక్రియలో ఎందుకు చేర్చలేదు?" అని జైరాం రమేష్ ప్రశ్నించారు.

# పడకేసిన తయారీ రంగం!



అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, దేశీయంగా నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా భారత తయారీ రంగం మందగించింది. ఈ ఏడాది జూన్‌లో తయారీ రంగం వృద్ధి తగ్గిందని ఎస్ అండ్ పి గ్లోబల్ నిర్వహించిన హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. జూన్ నెలలో పీఎంఐ 54.2 పాయింట్లకు పరిమితమయ్యిందని పేర్కొంది. మే నెలలో 55 పాయింట్లుగా ఉన్న ఈ సూచీ.. గత మూడు నెలలతో పోలిస్తే ఇదే అత్యల్ప స్థాయి అని సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఎగుమతులు, నియామకాల వేగం తగ్గడం ఈ పతనానికి ప్రధాన కారణాలని విశ్లేషించింది. పీఎంఐ సూచీ 50 పాయింట్ల కంటే పైన కొనసాగితే కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ ఇటీవల ఈ సూచీ పడిపోవడం ఆందోళకరం. జూన్ నెలలో పీఎంఐ 54.2 పాయింట్లకు పరిమితమయ్యిందని పేర్కొంది. మే నెలలో 55 పాయింట్లుగా ఉన్న ఈ సూచీ.. గత మూడు నెలలతో పోలిస్తే ఇదే అత్యల్ప స్థాయి అని సర్వే వెల్లడించింది. గతేడాది మార్చి తర్వాత ఎగుమతులు అత్యంత బలహీనమైన వృద్ధిని నమోదు చేశాయి.

# క్షీణించిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం..!




పాకిస్తాన్‌లో పలు కేసుల్లో జైలులో ఉంటున్న ఆ దేశ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆందోళన వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఇమ్రాన్‌ను తక్షణమే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని ధర్మాసనం మంగళవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. 48 గంటల్లోగా ఇమ్రాన్‌ను షిఫా ఇంటర్నేషనల్ ఆస్పత్రికి తరలించాలని కోర్టు ఆదేశించింది. సెప్టెంబరు 16 వరకు అక్కడే వుంచాలని పేర్కొంది. ఈ మేరకు ఇమ్రాన్ ప్రతినిధి నయీమ్ హైదర్ ఎక్స్ పోస్టులో తెలిపారు. క్రికెట్ నుండి రాజకీయాలకు మళ్ళిన ఇమ్రాన్ (73) 2023 ఆగస్టు నుండి జైల్లోనే వున్నారు. పలు కేసుల్లో ఆయన దోషిగా తేలడంతో జైలు శిక్ష అనుభవిస్తున్నారు. 2022లో తాను పదవీచ్యుతుడైన తర్వాత రాజకీయ కక్ష సాధింపు చర్యలతో మోపిన కేసులని ఆయన వాదిస్తున్నారు. కాగా గతేడాది కాలంగా తమ తండ్రి ఆరోగ్యం క్షీణిస్తోందని ఆయన కుమారులు ఆందోళన వ్యక్తం చేస్తూనే వున్నారు. జైల్లో వుండగా ఆయన కుడి కంటి చూపు పోయిందని లాయర్లు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పాక్ సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలు స్వాగతించదగ్గవని పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) ప్రతినిధి జుల్ఫీకర్ బుఖారి చెప్పారు. ఇది ముందే జరిగి వుంటే ఇంతలా ఆరోగ్యం దిగజారి వుండేది కాదని వ్యాఖ్యానించారు.

# మైక్రోసాఫ్ట్‌లో 5,000 మంది అవుట్!




ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న ఐటీ నిపుణులకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కోలుకోలేని షాక్ ఇవ్వబోతోంది. సంస్థలో మరోసారి భారీ ఎత్తున ఉద్యోగ కోతలు విధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ కొత్త లేఆఫ్స్ పరంపరలో భాగంగా కంపెనీ తన గ్లోబల్ వర్క్‌ఫోర్స్ నుంచి సుమారు 2.5 శాతం మంది సిబ్బందిని తొలగించనుందట. దీనివల్ల ఒకేసారి 5,000 మందికి పైగా ఉద్యోగుల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని సమాచారం. మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , జెనరేటివ్ ఏఐ టెక్నాలజీ మౌలిక సదుపాయాలలో వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ కొత్త సాంకేతికత సంస్థ యొక్క పాత సాఫ్ట్‌వేర్ వ్యాపారాన్ని దెబ్బతీస్తుందేమోనని ఇన్వెస్టర్లు భయపడుతున్నారు. దీంతో ఏఐ వైపు వేగంగా అడుగులు వేస్తున్న మైక్రోసాఫ్ట్.. ఆ ఖర్చులను భర్తీ చేయడం కోసం సాధారణ వ్యయాలను తగ్గించుకుంటోంది. ఇందులో భాగంగానే సేల్స్, కన్సల్టింగ్, గేమింగ్ విభాగాల్లోని ఉద్యోగులపై వేటు వేయనున్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్‌లో దాదాపు 2,20,000 మంది ఉద్యోగులు ఉన్నారు. యూఎస్ ఉద్యోగుల కోసం ఇప్పటికే సంస్థ ఒక ప్రత్యేక స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమాన్ని కూడా తెచ్చింది. వయస్సు, మొత్తం సర్వీసు అనుభవం కలిపి 70 సంవత్సరాలు దాటిన వారికి ఈ సదుపాయం వర్తించనుంది. గత నెల రోజుల్లో మైక్రోసాఫ్ట్ స్టాక్ ఏకంగా 17 శాతం మేర పతనమైంది. ఈ తీవ్ర ఆర్థిక ఒత్తిడి కారణంగానే కంపెనీ ఖర్చులను అదుపు చేయడానికి ఉద్యోగులను రోడ్డున పడేసే కఠిన నిర్ణయానికి మొగ్గు చూపుతోందని అంటున్నారు. ఇప్పటికే గూగుల్, అమెజాన్, మెటా, ఒరాకిల్ వంటి సంస్థలు వేలాది మందిని తొలగించగా.. ఇప్పుడు ఆ జాబితాలోకి మైక్రోసాఫ్ట్ కూడా చేరడం ఐటీ రంగాన్ని వణికిస్తోంది.

# నల్లసముద్రంలో నౌకపై దాడి.. చిక్కుకుపోయిన 13మంది భారతీయులు



నల్లసముద్రం తీరంలో ఉక్రెయిన్ ఓడరేవుపై దాడుల్లో 15మంది నావికులు చిక్కుకుపోయారు. చిక్కుకుపోయిన నావికుల్లో 13 మంది భారతీయులు ఉన్నారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లసముద్ర తీరంలోని ఉక్రెయిన్ ఓడరేవు అయిన చోర్నోమోర్స్క్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న క్ష?పణి, డ్రోన్ దాడులతో 15మంది నావికులు "భయంకరమైన, ప్రాణాంతక" పరిస్థితుల్లో చిక్కుకుపోయారని ఫార్వర్డ్ సీమెన్స్‌యూనియన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్‌యుఐ) ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. ఏక్షణంలో నైనా తమ నౌక ఎం.వి.ఎఎంఐఆర్‌పై దాడి జరగ వచ్చనే భయంతో ఉన్నట్లు ఆ ప్రకటన తెలిపింది. సంబంధిత అధికారులు, ఓడ యజమానులు, భారత ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, స్వదేశానికి రప్పించే ఏర్పాట్లుచేయాలని విజ్ఞప్తి చేసింది. భారత కాలమానం ప్రకారం.. పలావ్ దేశపు జెండా కలిగిన జనరల్ కార్గోషిప్ ఏజిఎన్ రాగ్నార్, డాన్యూబ్ నదిలోని బైస్ట్రే ముఖ ద్వారం నుండినల్ల సముద్రంలోకి వెళుతుండగా మూడు డ్రోన్‌ల దాడికి గురైనట్లు సమాచారం. 13మంది నావికుల్లో చంద్ర రామ్ దూబే, గుప్తా కుమార్ దీపక్‌అనే ఇద్దరు భారతీయ నావికులు (ఆర్డినరీ సీమన్‌లు) నౌక నుండి నీటిలోకి దూకారని, వారి ఆచూకీ లభించలేదని అధికారులు తెలిపారు. దాడులు కొనసాగుతుండటంతో గాలింపు చర్యలను నిలిపివేసినట్లు తెలిపారు. ఇద్దరు భారతీయులు, పైలట్‌తో సహా మిగిలిన ఏడుగురు సిబ్బందిని ఉక్రేనియన్ కోస్ట్ గార్డ్ సురక్షితంగా ఒడ్డుకు తరలించింది.

# చైనా గణిత శాస్త్రవేత్తలకు అత్యున్నత ప్రపంచ పురస్కారం





చైనాకు చెందిన ఇద్దరు విద్యావేత్తలు గణితశాస్త్రంలో తొలిసారిగా ప్రపంచ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. చైనా గణిత శాస్త్రవేత్తలు హాంగ్ వాంగ్, యుడెంగ్‌తో పాటు అమెరికాకు చెందిన జాన్ పార్డన్, కెనడాకు చెందిన జాసన్ సిమెర్మాన్ కూడా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. వీరు పదివేల ఐదు వందల డాలర్ల చొప్పున నగదు బహుమతి అందుకున్నారు. శతాబ్దానికి పైగా గణిత శాస్త్రవేత్తలను తికమక పెడుతున్న సమస్యలను పరిష్కరించినం దుకు చైనీయులు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికా, ఫ్రాన్స్‌లలో విద్యాబోధన చేస్తున్న వాంగ్ (35) ఈ గౌరవాన్ని అందుకున్న మూడో మహిళగా నిలిచారు. కృత్రిమ మేధ (ఏఐ) విసురుతున్న సవాళ్లు రోజురోజూ పెరుగుతున్న నేపథ్యంలో గణితశాస్త్రంలో నోబెల్‌కు సమానమై నదిగా భావించే ఫీల్డ్ మెడల్స్‌ను గురువారం అమెరికాలో వీరికి ప్రదానం చేశారు. కాగా చైనా సామాజిక మాధ్యమాలలో శాస్త్రవేత్తల ప్రతిభను ప్రశంసిస్తూ పోస్టులు వెలువడుతున్నాయి. వీబో నుంచి రెడ్‌నోట్ వరకూ వివిధ సోషల్ మీడియా వేదికలలో ఈ పోస్టులను లక్షలాదిగా తిలకిస్తున్నారు. వీరు పదివేల ఐదు వందల డాలర్ల చొప్పున నగదు బహుమతి అందుకున్నారు. శతాబ్దానికి పైగా గణిత శాస్త్రవేత్తలను తికమక పెడుతున్న సమస్యలను పరిష్కరించినం దుకు చైనీయులు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

# మహిళలకు 33% రిజర్వేషన్ల అమలులో జాప్యమొద్దు

**న్యూఢిల్లీ :** మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలులో జాప్యం వద్దని సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ డిమాండ్ చేశారు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్స్ (ఎన్‌సీడబ్ల్యూ ఆర్) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళన 12వ రోజు కొనసాగింది. మంగళవారం ఢిల్లీ నుంచే కాకుండా రాజస్థాన్ నుంచి కూడా పెద్ద సంఖ్యలో మహిళలు తమ సంప్రదాయ రంగుల దుస్తులను ధరించి ఆందోళనలో పాల్గొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ పాటలు కూడా ఆలపించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో మహిళలకు ఉన్న రాజ్యాంగపరమైన హక్కును సాధించేందుకు సీపీఐ(ఎం) పార్లమెంటు లోనూ, బయటా నిరంతరం పోరాడుతోందని అన్నారు. జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి షరతులతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. పార్లమెంటులో ఈ డిమాండ్‌ను బలంగా లేవనెత్తామని, ఈ అంశంపై దేశంలోని మహిళలకు బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలును వాయిదా వేయడానికి విధించిన షరతులు అన్యాయమైనవనీ, వివక్షతో కూడినవని రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందా కరత్ తెలిపారు. దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు సమాన రాజకీయ ప్రాతినిధ్యాన్ని నిరాకరించడం ప్రజాస్వామ్య సూత్రాలకు ద్రోహం చేయడమేనని, ప్రభుత్వం ఎటువంటి జాప్యం లేకుండా 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని పేర్కొన్నారు.

# వాహన రుణాలను దాటేసిన బంగారు రుణాలు!



దేశీయ రుణ మార్కెట్‌లో గోల్డ్ లోన్స్‌కు ప్రాధాన్యం వేగంగా పెరుగుతోంది. క్రిసిల్ రేటింగ్స్ తాజా నివేదిక ప్రకారం, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) బంగారు రుణాలు తొలిసారిగా వాహన రుణాలను అధిగమించి అతిపెద్ద అసెట్ కేటగిరీగా నిలిచాయి. సమీక్షించిన కాలంలో రుణాలను పెట్టుబడిదారులకు విక్రయించే మొత్తం సెక్యూరిటైజేషన్ జారీలు 22 శాతం పెరిగి రూ. 60,000 కోట్లకు చేరాయి. ఇందులో గోల్డ్ లోన్స్ వాటా 31 శాతం ఉండగా, ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న వాహన రుణాల వాటా 26 శాతానికి పడిపోయింది. స్థిరమైన లోన్ డిమాండ్, పెట్టుబడిదారుల నుంచి పెరుగుతున్న ఆసక్తి, వేగంగా నిధులు సమీకరించే అవసరం వల్ల ఎన్‌బీఎఫ్‌సీలు గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియోలను పెద్ద ఎత్తున సెక్యూరిటైజ్ చేస్తున్నాయని క్రిసిల్ తెలిపింది. ముఖ్యంగా 98 శాతం జారీలు ఎన్‌బీఎఫ్‌సీల నుంచే రావడం ఈ రంగంలో వాటి ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తోంది. గోల్డ్ లోన్స్‌లో నష్టాలు తక్కువగా ఉండటం, రిస్క్ తక్కువగా కనిపించడం వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా వీటిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. మరోవైపు, వ్యాపార రుణాలు, మైక్రోఫైనాన్స్ రుణాల సెక్యూరిటైజేషన్ కూడా పెరుగుతుండగా, హౌసింగ్ రుణాల వాటా తగ్గింది. రిటైల్ రుణాలపై డిమాండ్, పెట్టుబడిదారుల ఆసక్తి కొనసాగితే రాబోయే త్రైమాసికాల్లో కూడా సెక్యూరిటైజేషన్ మార్కెట్ ఇదే జోరు కొనసాగించే అవకాశాలు ఉన్నాయని క్రిసిల్ అంచనా వేస్తోంది.

# సగం హైదరాబాద్ లో సెటిలర్స్ ప్రభావమే..?

# 28 నియోజకవర్గాల్లో 15 చోట్ల డామినేషన్!

**హైదరాబాద్,** : ఆంధ్రా సెటిలర్స్ ఈసారి హైదరాబాద్‌లో ఓట్లేయడం లేదా.. అన్న విషయం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ తర్వాత భారీగా ఓట్లు కేటగిరీలోకి వెళ్లడం, మరికొన్ని లక్షల ఓట్లు ఉండటం హైదరాబాద్ రాజకీయాలపై కొత్త చర్చకు తెరతీసింది. సెటిలర్స్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల తగ్గుదల ఆసక్తికరంగా మారింది. తెలంగాణ ఎన్నికలు అనగానే ప్రత్యేకంగా చర్చకు వచ్చే అంశాల్లో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఒకటి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆంధ్రా ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక వర్గంగా చాలాకాలంగా చర్చలో ఉంటున్నారు. కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 15 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం గణనీయంగా ఉందనే అంచనాలు ఉన్నాయి.ప్రతి ఎన్నికల సమయంలో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఏ వైపు మొగ్గుతాయి? ఏ పార్టీకి లాభం చేకూరుతుంది? అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. అయితే ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది.తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ?లో భారీ సంఖ్యలో ఓట్లు జాబితా నుంచి తొలగించడం మరికొన్ని ఓట్లను పెండింగ్‌లో ఉంచడం ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోంది. తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లను తొలగించారు. వీళ్లను లో పెట్టారు. అంటే గైర్హాజరు, వేరే ప్రాంతానికి మారిన వారు, తొలగించబడిన లేదా డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి ఓట్లు ఈ కేటగిరీలోకి వెళ్లాయి. అంటే.. మళ్లీ అప్లై చేసుకుంటే తప్ప ఈ ఓట్లు లేనట్లే. జూన్ నాటికి తెలంగాణలో మొత్తం 3 కోట్ల 38 లక్షల 26 వేల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73 లక్షల ఓట్లు పోయాయంటే.. మొత్తం ఓటర్లలో దాదాపు 22 శాతం ఓట్లు జాబితా నుంచి బయటకు వెళ్లినట్టవుతుంది. తర్వాత తెలంగాణ ఓటర్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు మిగిలాయి. అయితే ఈ ఓట్లన్నీ పూర్తిగా ధృవీకరించినవని చెప్పలేమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. మరో 92,87,577 ఓట్లను విత్ హెల్డ్ కేటగిరీలో ఉంచారు. ఈ ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో తేడాలు, సమర్పించిన పత్రాలు 2002 రికార్డులతో సరిపోకపోవడం వంటి కారణాలతో వాలిడేషన్ పూర్తికాలేదని చెబుతున్నారు.అంటే తెలంగాణలో తొలగించబడిన 73 లక్షల ఓట్లతో పాటు మరో దాదాపు 93 లక్షల ఓట్లు కూడా ప్రస్తుతం తుది స్థితిలో లేవు.తొలగించిన, పెండింగ్‌లో ఉంచిన ఓట్లను కలిపితే ఈ సంఖ్య దాదాపు 1.66 కోట్లు.అంటే తెలంగాణ మొత్తం ఓటర్లలో దాదాపు సగం ఓట్లు ఏదో ఒక రకంగా ప్రభావానికి లోనైనట్టుగా కనిపిస్తోంది.ఇక్కడే అసలు కీలకమైన విషయం బయటకు వస్తోంది. తెలంగాణలో కేటగిరీలోకి వెళ్లిన 73 లక్షల ఓట్లలో 43 లక్షల ఓట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలోనే ఉన్నాయని లెక్కలు సూచిస్తున్నాయి. అంటే తెలంగాణలోని 33 జిల్లాల్లో తొలగించబడిన ఓట్లలో దాదాపు 60 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయి. ఇదే సమయంలో ఈ మూడు జిల్లాల్లో మరో 39 లక్షల ఓట్లు అభ్యంతరాలు, మ్యాపింగ్ లేదా ఇతర ధృవీకరణ సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అంటే తొలగించబడిన లేదా ఇంకా పూర్తిగా ఆమోదించబడని ఓట్లలో దాదాపు 83 లక్షలు కేవలం ఈ మూడు జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.ఇక్కడి నుంచే కేవలం ఓటర్ల లెక్కలకు సంబంధించిన అంశమేనా? లేక హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపుతుందా? అనే ప్రశ్న మొదలవుతోంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఇందులో 43 లక్షల ఓట్లు కేటగిరీలోకి వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే మెట్రోపాలిటన్ ప్రాంతంలోని దాదాపు 37 శాతం ఓట్లు ప్రభావితమయ్యాయి. తెలంగాణలో నమోదైన ప్రతి 100 ఓట్లలో దాదాపు 59 ఓట్లు హైదరాబాద్ మెట్రో ప్రాంతం నుంచే ఉన్నట్లు కనిపిస్తోంది.అయితే ఈ 43 లక్షల ఓట్లన్నీ ఆంధ్రా సెటిలర్స్‌వే అని చెప్పడానికి ఆధారం లేదుహైదరాబాద్ ఒక మెట్రో నగరం కావడంతో తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి, అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు.అయితే ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ మార్పులు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి.మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉందనే చర్చ ఉంది. రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఖైరతాబాద్, రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్ వంటి నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మొత్తంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 నియోజకవర్గాల్లో దాదాపు 15 చోట్ల ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం స్పష్టంగా ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇక కొన్ని నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ తిరిగి ఇవ్వని వారి శాతం కూడా గమనించదగ్గ స్థాయిలో ఉంది.సనత్‌నగర్‌లో 45 శాతం, జూబ్లీహిల్స్‌లో 45 శాతం, ముషీరాబాద్‌లో 43 శాతం, ఎల్‌బీనగర్‌లో 44 శాతం ఫారాలు తిరిగి ఇవ్వలేదని లెక్కలు చెబుతున్నాయి. అయితే వీరంతా ఆంధ్రా సెటిలర్స్ అని చెప్పలేం కానీ.. ఈ నియోజకవర్గాల పరిధిలో ఆంధ్రా ప్రజలు ఎక్కువగా ఉంటున్నారన్నది నిజం. వాళ్లలో మెజారిటీ ఆంధ్రా ప్రాంతంలోనే ఓటుహక్కును కొనసాగించుకున్నారు. ఈ విషయంలు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా తెలిసింది. చాలా కాలనీల్లో " మేం మా ఊళ్లలోనే ఓటును కొనసాగించుకుంటాం" అని చెప్పారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కొన్ని ప్రాంతాల్లో ఓట్ల తగ్గుదల గణనీయంగా కనిపిస్తోంది. శేరిలింగంపల్లిలో 3.2 లక్షలకు పైగా ఓట్లు తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా, దాదాపు 42 శాతం ఓట్లు తగ్గిన నియోజకవర్గంగా ఇది నిలిచింది. ఆ తర్వాత ఎల్‌బీనగర్‌లో 2.7 లక్షలు, రాజేంద్రనగర్‌లో 2.4 లక్షలు, మహేశ్వరంలో 2.3 లక్షల ఓట్లు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి.అయితే ఒక నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు తగ్గాయి అన్నది మాత్రమే రాజకీయంగా ముఖ్యం కాదు. ఎవరి ఓట్లు తగ్గాయి? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే ఓటర్ల సంఖ్య తగ్గడం ప్రతి పార్టీపై ఒకే విధమైన ప్రభావాన్ని చూపదు.ఈ మూడు జిల్లాల్లో హైదరాబాద్ జిల్లాకు ప్రత్యేక పరిస్థితి ఉంది. పాతబస్తీతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలను కలుపుకున్న హైదరాబాద్ జిల్లాలో 47 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు.వారిలో దాదాపు 19 లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదని లెక్కలు చెబుతున్నాయి. అంటే దాదాపు 40 శాతం ఓటర్లపై ప్రభావం పడినట్టుగా కనిపిస్తోంది. పాతబస్తీ ప్రాంతంలో అనేక మంది ఓటర్లకు సరైన పత్రాలు లేకపోవడం, ప్రక్రియలో అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించలేకపోవడం వంటి కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమై ఉండవచ్చని చెబుతున్నారు. డాక్యుమెంట్లు ఇచ్చిన వారిలో కూడా 12లక్షల మందికి ఇక్కడ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే తొలగించబడిన ఓట్లతో పాటు మరో



భారీ సంఖ్యలో ఓటర్లకు ఎన్నికల సంఘం నుంచి నోటీసులు వెళుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో మరో 27 లక్షల ఓట్లకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. పత్రాల్లో తప్పులు, 2002 మ్యాపింగ్‌తో సరిపోని వివరాలు వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు.ఈ ఓట్లలో ఎన్ని తిరిగి ధృవీకరించబడతాయి? ఎన్ని ఓట్లు తుది జాబితాలోకి వస్తాయి? అనేది తదుపరి ప్రక్రియలో తేలాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో 12లక్షల మందికి నోటీసులు వెళ్లాయి. తొలగించిన ఓట్లకు ఇవి అదనం. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా సెటిలర్స్... రాజకీయంగా కొంత ప్రభావం చూపించారు. వీరిలో కొంతమంది ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వారున్నారు. ఇప్పుడు ఓట్ల రివిజన్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోనుందా అన్న చర్చ మొదలైంది. ఇక్కడ సెటిలైన వారు.. హైదరాబాద్ ఓటర్లుగా పూర్తిగా మారారా?లేక... "మా ఓటు సొంత రాష్ట్రంలోనే కొనసాగాలి" అని నిర్ణయించుకున్నారా? అనే ప్రశ్న వస్తోంది. రెండో పరిస్థితి పెద్ద సంఖ్యలో నిజమైతే ఒక ఆసక్తికరమైన పరిస్థితి ఏర్పడుతుంది."హైదరాబాద్‌లో ఆంధ్రా జనాభా కనిపిస్తుంది. కానీ ఆంధ్రా ఓటు కనిపించదు." ఇది హైదరాబాద్‌లోని రాజకీయ పార్టీలకు కీలకమైన అంశంగా మారే అవకాశం ఉంది.హైదరాబాద్‌లోని ఆంధ్రా సెటిలర్స్ ఓట్లన్నీ ఒకే పార్టీకి వెళ్తాయనే అభిప్రాయం కూడా పూర్తిగా సరైంది కాదు. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్‌గా ఉన్న సమయంలో ఆంధ్రా సెటిలర్స్‌లో కొంత మొగ్గు ఆ పార్టీ వైపు ఉండేదనే రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కానీ ఇప్పుడు తెలంగాణ రాజకీయ పరిస్థితి మారిపోయింది. తెలంగాణలో ప్రధాన రాజకీయ పోటీ తెలంగాణకు చెందిన పార్టీల మధ్యనే సాగుతోంది. అందువల్ల ఓటర్ల సంఖ్య తగ్గడం వల్ల ఏ పార్టీకి ఎంత నష్టం? ఏ పార్టీకి ఎంత లాభం? అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పడం కష్టం.ాఎఖీ ప్రక్రియ కేవలం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ మాత్రమే. అయితే కేవలం మూడు జిల్లాల పరిధిలోనే దాదాపు 80లక్షల ఓట్లు తొలగిపోవడం, పెండింగ్‌లో ఉండటం అనేది.. చిన్న విషయం కాదు. ఇది భవిష్యత్‌లో రాజకీయంగా తీవ్ర ప్రభావాన్ని చూపించే అంశం. ముఖ్యంగా ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్యలో వచ్చిన మార్పులతో రాజకీయ పార్టీలు తమ ప్లానింగ్ మార్చుకోవలసి పరిస్థితి. ఇక ఏ ప్రభావాలకు లొంగని పాతబస్తీ ప్రాంతం కూడా ఈ?సారి కుదుపునకు గురైంది. ప్రత్యేకంగా ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో 35శాతం ఓట్లు తగ్గిపోయాయి. ఏకపక్ష మెజార్టీలతో గెలుస్తున్న కు ఇది కాస్త ఇబ్బందికరమే. ఇది గెలుపుపై ప్రభావం చూపకపోయినా.. మిగిలిన పార్టీలకు పోటీ ఇవ్వడానికి అవకాశం కల్పిస్తుంది. ఆంధ్రావాళ్ల ఓట్లన్నీ తెలంగాణ నుంచి వెళ్లిపోయావా..కు భారీ గండి పడబోతోందా అన్నది తుది ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాతనే తేలనుంది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

హైదరాబాద్ : రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఖజాగూడ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ వద్ద డివైడర్ను బైకు ఢీకొట్టింది. ఘటనలో ఒక్కరు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఖజాగూడ నుండి అంజయ్య నగర్ వైపు వెళుతుండగా, కేర్ ఖీఇ హాస్పిటల్ మెయిన్ రోడ్డు మలుపు వద్ద ప్రమాదం జరిగింది. బైక్పై వెళ్తున్న ముగ్గురు యువకులు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించారు. వెనుక కూర్చున్న అబ్బాస్ సిద్ధిక్ (25) అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న సహస్ర ఛటోపాధ్యాయ (25), అభిజిత్ సింగ్ (25)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులను తక్షణమే కేర్ హాస్పిటల్కు తరలించి చికిత్స అందిస్తున్నారు. రాయదుర్గం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## కోచ్ లేడని సరూర్ నగర్ స్టేడియం ముందు అందోళన



రంగారెడ్డి : ఎల్ బి నగర్ లోని సరూ నగర్ ఇండోర్ స్టేడియం ముందు పేరెంట్స్ ఆందోళన కి దిగారు. 3 నేలలుగా క్రికెట్ కోచ్ రావడంలేదాంటూ ఆరోపోస్తూ ఆందోళనకి దిగారు. వెంటనే కొత్త క్రికెట్ కోచ్ ను ఏర్పాటు చేయాలనీ,డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఒకవైపు క్రీడాకారులు ఒలంపిక్ ఆడాలంటూ చెప్తుంటే ఇక్కడ మాత్రం క్రికెట్ కోచ్ లేకుండా మూడు నెలలు కాలయాపన చేస్తున్నారని తమ భవిష్యత్ పాడు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.క్రికెట్ కిట్ లు ఉన్న తమకి ఇవ్వడం లేదని జిల్లా కలెక్టర్ కి కూడా పిర్యాదు చేశామని తెలిపారు.తమకి వెంటనే క్రికెట్ కోచ్ నియమించాలని డిమాండ్ చేశారు.

## ఫార్మా కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతీ గూడెం గ్రామంలో హెజిలో ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు భారీగా ఎగిసి పడ్డాయి. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసారు. ఘటనలో గాయాపడ్డ ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. మరో పది మందికి గాయాలు అయ్యాయి. పోలీసులు క్షగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రియాక్టర్ పేలడం తో ప్రమాదానికి కారణంగా అనుమానిస్తున్నారు. ఒక్కసారిగా రియాక్టర్ పేలడం తో భారీ శబ్దానికి దోతీ గూడెం, అంతమ్మా గూడెం గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. మూడు నెలల పరిధి లో రెండవ సారి ప్రమాదం ఈ కంపెనీ లో చోటు చేసుకుంది.

## మనమందరం కలిసి మంచి సమాజ నిర్మాణం కోసం పాటుపడదాం"

### -బయ్యారం మండలం సంతులాల్ పాడు గ్రామ పంచాయితీలో మన ఊరు - మన బాధ్యత కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. శబరీష్,

మహబూబాబాద్ : బయ్యారం మండలం సంతులాల్‌పాడు గ్రామపంచాయతీలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'మన ఊరు ? మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పరిధిలోని సుమారు 800 మంది ప్రజలు పాల్గొన్నారు.ముందుగా గ్రామస్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, సీసీ కెమెరాల అవసరం, వాటి ప్రయోజనాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కొత్తపేట సర్పంచ్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆలోచనలకు అనుగుణంగా మొదటి విడతలో కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో 26 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అనంతరం దొంగతనాలు గణనీయంగా తగ్గాయని, బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వంటి మాదకద్రవ్యాలను వినియోగించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు సీసీ కెమెరాలను చూసి భయపడుతున్నారని తెలిపారు. ప్రజలు, పోలీసుల సమన్వయంతో గ్రామంలో మరింత భద్రతను పెంపొందించుకోవచ్చని అన్నారు.సంతులాల్‌పాడు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని సురక్షితంగా ఉంచేందుకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామాన్ని మాదకద్రవ్యాల నుంచి కాపాడటంతో పాటు యువతను గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రజలందరం కలిసి బాధ్యతగా వ్యవహరిస్తామని అన్నారు.అనంతరం గ్రామస్థులు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం, గంజాయి నుంచి గ్రామాన్ని మరియు యువతను రక్షించడం వంటి అంశాలపై సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు.సీఐ రవీందర్ మాట్లాడుతూ గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, వాటి విక్రయం, వినియోగంపై చట్టపరంగా విధించే శిక్షలు, జరిమానాల గురించి గ్రామస్థులకు వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి, వాటి నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు.డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆలోచనల నుంచి రూపుదిద్దుకున్న 'మన ఊరు ? మన బాధ్యత' కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గడం, గంజాయి వినియోగం తగ్గడం, హెల్మెట్ వినియోగం పెరగడం వంటి సానుకూల మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. పోలీసులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా భాగస్వాములైనప్పుడే ఈ కార్యక్రమం మరింత విజయవంతమవుతుందని అన్నారు.అనంతరం జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ, "మనం చేసే పనులను చూసే మన పిల్లలు నేర్చుకుంటారు. మన ఆలోచనలు, మన నిర్ణయాలను బట్టే మన జీవనశైలి ఉంటుంది. మన జీవనశైలినే మన పిల్లలు అనుసరిస్తారు. ఈరోజు మనం తీసుకునే నిర్ణయమే రేపు మన జీవితాన్ని, మన పిల్లల భవిష్యత్తును మార్చగలదు" అని అన్నారు.

## మార్నింగ్ వాక్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించారు. నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో స్థానిక శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న మరియు ఇప్పటికే పూర్తయిన, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, లబ్ధిదారుల మనోగతాన్ని తెలుసుకున్నారు.మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడినప్పుడు, సొంతింటి కల నెరవేరిందనే ఆనందం వారి కళ్లలో కనిపించింది. ఈ ప్రభుత్వానికి ఆశీర్వాదాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ వారు చెప్పిన మాటలు నాకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించాయని అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాల జీవితాల్లో తీసుకొస్తున్న మార్పును ప్రత్యక్షంగా చూడటం ఒక గొప్ప అనుభూతి. వారి ముఖాల్లో కనిపించిన ఆనందమే ప్రజా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతున్నయి అనేందుకు నిదర్శనం. ఇతకంటే ఒక మనిషికి కావాల్సింది ఏముంటది..? ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో మాట్లాడినప్పుడల్లా పేదింటి చిరకాల కలను తీర్చే బాధ్యత దొరకడం అనేది నా అదృష్టంగా బావిస్తుంటా.. ఈ సందర్భంగా లబ్దిదారులకు కానుకలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. తరువాత హైదరాబాద్ తరహాలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ను రాష్ట్రంలోని ఇతర పట్టణాలలో కూడ నిర్మించేలా నిజామాబాద్ నుండి శ్రీకారం చుట్టబోతున్నాం. దీనికి కోసం



నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న హౌసింగ్ శాఖ కు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలందరికి ఇవ్వాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు విడతలు, హైదరాబాద్లో ఇచ్చే మొదటి విడత ఇండ్లతో కలిసి 8 లక్షల ఇండ్లు మంజూరు చేశాం, 2 లక్షల ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడ పూర్తయ్యాయని అన్నారు. అక్కడనుండి నిజామాబాద్ పట్టణంలో గత ప్రభుత్వాలు నిర్మించదలచి, అరకొరగా నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాన్ని పరిశీలించి, నివాసయోగ్యానికి కావాల్సిన నిర్మాణాలు, వసతులను వెంటనే పూర్తిచేసి, అర్హులైన లబ్దిదారులకు ఎంపిక చేసి ఇండ్లను మంజూరు చేసి, అందించాలని జిల్లా కలెక్టరు, అధికారులను ఆదేశించారు.

## పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

### న్యాయమూర్తి ఎన్ రెడ్డి ప్రసన్న, ధవలేశ్వరం ఎస్సై హరిబాబు

ధవలేశ్వరం : మహిళలు, చిన్నారులకు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్, ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ ఆఫ్ జువెనల్ జస్టిస్ బోర్డ్, రాజమహేంద్రవరం మెజిస్ట్రేట్ ఎన్. రెడ్డి ప్రసన్న, ధవలేశ్వరం ఎస్సై బి హరిబాబు తెలిపారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధి కలెక్టరేట్ వెనక గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు బాలల చట్టాలు, పోక్సో యాక్ట్, ఇతర చట్టాలుపై అవగాహన, చదువుకునే దశలో పిల్లలు పాటించవలసిన నియమాలు,అపరిచిత వ్యక్తులతో పిల్లలు ప్రవర్తించవలసిన తీరు, ఈవ్‌టీజింగ్, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహనతో పాటు పీర్ ప్రెజర్‌కు లోనుకాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చిన్నారుల భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం వంటి పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని, విద్య మరియు భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, చిన్నారులు సురక్షితంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని ధవలేశ్వరం ఎస్సై తెలిపారు.

## గోదావరి పుష్కరాలకు 1000 కోట్లు

**హైదరాబాద్, ఆగస్టు 15 .**2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ పుష్కరాల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'గోదావరి పుష్కరాలు-2027'పై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా జరుగుతున్న పురోగతిని కమిటీ సభ్యులు సమీక్షించి, అధికారులకు కీలక సూచనలు చేశారు.భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే 'టైర్-1' ప్రాంతాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా సీనియర్ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు.పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి, స్థానిక నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పండితులను భాగస్వాములను చేయాలని సూచించారు. భక్తులకు సేవ చేసేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలన్నారు.

# చేదెక్కిన చక్కెర..



ముంబై : దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించడానికి, రాబోయే పండుగ సీజన్‌లో తగినంత లభ్యతను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకారం చక్కెర ధర జూలై 20న కిలోగ్రాముకు రూ..48.18 నుండి ఆగస్టు 20 నాటికి కిలోగ్రాముకు రూ.55.70కి పెరిగింది. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసరమైన ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతలను నివారించడానికి చర్యలు తీసుకుంటోంది పండగల వేళ 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుతించింది కేంద్రం. చక్కెర వ్యాపారులకు 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను విధించింది. అయితే చక్కెర నిల్వలపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది.ఇటీవలి చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని నిందించడం సరికాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12% నుండి 2025-26 నాటికి సుమారు 9%కి తగ్గుతుంది. అంతేకాకుండా, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో సుమారు ముప్పావు వంతు ఇప్పుడు ధాన్యాల నుండి, ప్రధానంగా మొక్కజొన్న నుండి ఉత్పత్తి అవుతోంది.ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు పంటకు వాతావరణం వల్ల కలిగిన నష్టం, ప్రపంచవ్యాప్తంగా చక్కెర సరఫరా కొరత, పరిశ్రమలోని కొన్ని వర్గాలలో ఊహాగానాలు, నిల్వలు వంటివి ఉన్నాయి.చెరకు పండించే రాష్ట్రాలు మొదట్లో అంచనా వేసిన సుమారు 343 లక్షల మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి సుమారు 306 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే అధిక వర్షపాతం వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతింది.అంచనా వేసిన దానికంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పటికీ, అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినంత చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయి .ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర ధరలు పెరుగుతున్నాయి. చక్కెర సరఫరా కొరత అనేది ప్రపంచవ్యాప్త పరిణామం, ఇది భారతదేశానికే పరిమితం కాదు. 2026-27 సంవత్సరానికి ప్రపంచ చక్కెర కొరత సుమారు 33 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులపై ఆందోళనలు ప్రపంచ దృక్పథాన్ని మరింతగా ప్రభావితం చేశాయి. ఫలితంగా అంతర్జాతీయ చక్కెర ధరలు 30 జూన్ 2026న టన్నుకు వి474 నుండి 20 ఆగస్టు 2026 నాటికి టన్నుకు వి552కు భారీగా పెరిగాయి. రెండు నెలల కన్నా తక్కువ వ్యవధిలోనే 16% పైగా పెరుగుదల నమోదైంది. ఇథనాల్ కార్యక్రమం రైతులకు సహాయపడి, చక్కెర మిల్లులను బలోపేతం చేసింది.భారతదేశం సాధారణంగా సంవత్సరానికి సుమారు 320-340 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేస్తుంది. అయితే దేశీయ వినియోగం సుమారు 280-290 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుంది . ఉత్పత్తి అధికంగా ఉన్న సంవత్సరాలలో, అదనపు నిల్వలు చక్కెర మిల్లుల నిధులను నిలిపివేసి, చెరకు రైతులకు చెల్లింపులను ఆలస్యం చేయగలవు. అదనపు చక్కెరను ఇథనాల్ వైపు మళ్లించడం ఈ నిర్మాణాత్మక సమస్యను పరిష్కరించడంలో సహాయపడి, చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచింది.ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2026 ఆగస్టు 20 నాటికి, 2025-26 చక్కెర సీజన్‌కు సంబంధించిన చెరకు బకాయిలలో 97 శాతాన్ని రైతులకు ఇప్పటికే చెల్లించారు. చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో, ప్రభుత్వ మద్దతుపై వాటి ఆధారపడటం కూడా తగ్గింది. 2014 నుండి 2021 మధ్య చక్కెర పరిశ్రమకు సుమారు రూ. 14,600 కోట్ల సబ్సిడీని అందించగా, 2021-22 నుండి అటువంటి సబ్సిడీ ఏదీ ప్రకటించబడలేదు. అదే సమయంలో వినియోగదారులకు చక్కెర ధరలు దీర్ఘకాలంలో స్థిరంగా ఉన్నాయి. ఆగస్టు 2024 మరియు జూలై 2026 మధ్య సంవత్సరానికి సుమారు 3% మాత్రమే పెరిగాయి . నిల్వలకు వ్యతిరేకంగా, సరఫరాను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# రాయదుర్గంలోని భూములు రికార్డు ధర



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. ఓజౌ రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్ధలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు.రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మీ దూరం ఉందని, రెండింటికీ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇంకా ఈ విషయంపై ఏమైనా వివాదాలుంటే తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూచించింది.ఇప్పటికే ఈ వేలంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్‌ఆర్‌టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్‌ఎండీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిందే. దీంతో ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధరతో టీజీఐఐసీ చేపట్టిన ఆన్‌లైన్ వేలానికి మార్గం సుగమమైంది. అయితే టీజీఐఐసీ ఆన్‌లైన్లో భూమల వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో ఎకరా 264 కోట్లు పలికింది. దాదాపు మూడు నెలల కిందట నిర్వహించిన వేలంలో ఇక్కడి భూమి ఎకరా రూ. 237 కోట్లు పలికిన విషయం తెలిసిందే.

# మరో ఎంపీకి అమాత్య యోగం!



**హైదరాబాద్** : కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం వస్తుందన్న సమాచారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల చేపట్టిన బీజేపీ కేంద్ర కమిటీ విస్తరణలో తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం, అదే సమయంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖ నేతలను జాతీయ కార్యకర్గం నుంచి తప్పించడంతో ఈ ప్రచారానికి ఊతమిస్తుందని చెబుతున్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. పునర్వ్యవస్థీకరణలో మరొకరికి చాన్స్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు.మరో రెండేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హాట్ ఫేవరెట్ గా పోటీ ఇవ్వాలంటే రాష్ట్రంలో బీజేపీ నేతలు మరింత క్రియాశీలంగా పనిచేయాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతిపక్షాన్ని వెనక్కి నెట్టి ఆ స్థానంలో పోటీ ఇవ్వడమే కాకుండా, అధికారంలోకి రావాలంటే పార్టీని ఇంకా విస్తరించాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. తమ లక్ష్యానికి చేరువ కావాలంటే పార్టీని పరిగెత్తించాలని, ఇందుకోసం నేతలకు కొత్త పదవులతో ప్రోత్సహించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో తెలంగాణ నుంచి కచ్చితంగా ఒకరికి అవకాశం వస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఇంకా మిగిలిన ఆరుగురిలో ఒకరికి చాన్స్ ఇస్తారా? లేక బయట రాష్ట్రాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికే చెందిన ఎంపీలకు అవకాశం ఇస్తారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన ఇద్దరు బీజేపీ నేతలు బయట రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరిలో సంఘ్ నేపథ్యం ఉన్న ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య ఉన్నారు. లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చెందిన 8 మందిలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందనేది విస్తృత చర్చగా ఉందని చెబుతున్నారు. ప్రధానంగా అనేక సమీకరణాలను పరిశీలిస్తున్న బీజేపీ అధిష్టానం బీసీ, మహిళ కోటాలో ఒకరికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే బీసీ కోటాలో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ మంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి చెందిన మహిళా నాయకురాలు డీకే అరుణ మంత్రి పదవి రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీకే అరుణను మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే ఆలోచనతోనే ఆమెను బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని చెబుతున్నారు. కేంద్రం చెప్పిన కారణమేంటి? ప్రస్తుత సమీకరణాలను పరిశీలిస్తే కేంద్ర మంత్రివర్గంలో డీకే అరుణకు చోటిచ్చే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు. డీకే అరుణ సీనియార్టీ, సామాజిక నేపథ్యంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఆమెకు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతానికి చెందిన అరుణ అన్నిరకాలుగా సీఎం స్పీడుకు బ్రేకులు వేయగలరని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దన్నుగా ఉంటున్న అగ్రవర్ణాలలోనూ చీలక తేవడానికి అరుణ నాయకత్వం ఉపయోగపడుతుందనే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. అయితే ఆమెకు దీటుగా బీసీ నేత లక్ష్మణ్ పేరు కూడా ఎక్కువగా వినిపిస్తోందని అంటున్నారు. తొలి నుంచి బీజేపీలో కొనసాగుతున్న లక్ష్మణ్ కు సంఘ్ నేపథ్యం అదనపు బలంగా చెబుతున్నారు. దీంతో రాష్ట్రం నుంచి డీకే అరుణ, లక్ష్మణ్ మధ్య మంత్రి పదవికి గట్టి పోటీ జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# ధనుష్ పొలిటికల్ ఎంట్రీ...?



చెన్నై: తమిళ స్టార్ ధనుష్ చుట్టూ పొలిటికల్ ఎంట్రీకి సంబంధించిన చర్చ రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఆయన సోషల్ మీడియా ప్రెజెన్స్‌ను మరింత బలోపేతం చేసేందుకు.. రాజకీయ పార్టీల డిజిటల్ టీమ్స్ తరహాలో ప్రత్యేకంగా ఓ ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.ఈ డిజిటల్ టీమ్ కోసం దాదాపు ?1 కోటి వరకు ఖర్చు చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో ధనుష్‌కు సంబంధించిన కంటెంట్‌ను పర్యవేక్షించడం, ఫ్యాన్ బేస్‌ను మరింత యాక్టివ్‌గా మార్చడం, ఆయన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి బాధ్యతలు ఈ టీమ్ చూసుకోనుందని టాక్.ఇది నిజమైతే.. కేవలం సినిమా ప్రమోషన్ కోసం ఏర్పాటు చేస్తున్న టీమ్ కంటే చాలా పెద్ద వ్యవస్థగా ఉండొచ్చనే చర్చ మొదలైంది. ముఖ్యంగా తమిళనాడులో రాజకీయ పార్టీల ఐటీ వింగ్స్ సోషల్ మీడియా నేరేటివ్, గ్రౌండ్ లెవల్ కమ్యూనికేషన్, డిజిటల్ క్యాంపెయిన్లలో కీలకంగా మారిన నేపథ్యంలో.. ధనుష్ కూడా అదే తరహా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారన్న వార్త ఆసక్తిని పెంచుతోంది.ఇప్పటికే ధనుష్ ఫ్యాన్ క్లబ్స్‌లో కదలికలు పెరిగాయి. సంక్షేమ కార్యక్రమాలు చేయాలని అభిమానులకు ఆయన పిలుపునివ్వడం, ఫ్యాన్ క్లబ్ కార్యకలాపాలు విస్తరించడం, కొన్ని ప్రాంతాల్లో వాటిని మరింత వ్యవస్థీకృతం చేయడం వంటి పరిణామాలు పొలిటికల్ ఎంట్రీ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.అయితే.. ధనుష్ రాజకీయాల్లోకి వస్తున్నారన్నది ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ?1 కోటి ఖర్చుతో ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారన్న వార్తకు కూడా ధనుష్ లేదా ఆయన టీమ్ నుంచి అధికారిక ధృవీకరణ లేదు.కానీ వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. ధనుష్ విషయంలో అసలు సినిమా ఏంటి, పొలిటికల్ స్కెచ్ ఏంటి అనేది ఇప్పుడు తమిళనాట ఆసక్తికరంగా మారింది

# మళ్లా పెరుగుతున్న బంగారం ధరలు



**ముంబై,** : బంగారం, వెండి ధరలు ఇంటర్నేషనల్ మార్కెట్లో మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. దీంతో దేశీయంగా కూడా మళ్లీ గోల్డ్, సిల్వర్ రేట్లు ఎగబాకుతున్నాయి. గత 10 రోజుల వ్యవధిలో కేవలం ఒక్క రోజు మాత్రమే బంగారం ధర తగ్గింది. మిగతా అన్ని రోజులు భారీగా పెరుగుతూ పోయింది. ఈ క్రమంలో దాదాపు రూ. 6-7 వేల వరకు రేటు పెరిగిందని చెప్పొచ్చు. ఇంటర్నేషనల్ మార్కెట్లో ప్రస్తుతం స్పాట్ పసిడి రేటు ఔన్సుకు 4600 డాలర్ల మార్కు దాటి ట్రేడవుతోంది. సిల్వర్ ధర 69 డాలర్ల మార్కు వద్ద ఉంది. ఇక డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ప్రస్తుతం రూ. 95.73 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని దిల్లీలో ప్రస్తుతం 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1,47,250 వద్ద ఉండగా, 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 1,60,630 వద్ద ఉంది. చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతాల్లో 22 క్యారెట్లు, 24 క్యారెట్ల పసిడి ధర వరుసగా రూ. 147100, రూ. 160480 వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా దేశీయంగా కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆగస్ట్ 22న ఉదయం 7.30 గంటల సమయంలో హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1100 పెరిగి తులం రూ. 1,47,100 వద్ద ఉంది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1210 పెరగడంతో 10 గ్రాములకు రూ. 1,60,480 వద్ద ఉంది.మరోవైపు హైదరాబాద్ మార్కెట్‌లో సిల్వర్ రేటు ఆగస్ట్ 22న రూ. 5 వేలు పెరిగింది. దీంతో ప్రస్తుతం కేజీకి రూ. 2.65 లక్షల వద్ద ఉంది. ముందటి రోజు వెండి ధర ఏకంగా రూ. 10 వేలు పెరగ్గా, దానికి ముందు మాత్రం రూ. 5 వేలు పడిపోయింది. ఇక గత 2 రోజుల వ్యవధిలో చూస్తే సిల్వర్ రేటు రూ. 15 వేలు ఎగబాకింది.ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరిగాయి. అమరావతి, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 147100 వద్ద ఉండగా, 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ. 160480 వద్ద ఉంది.ఇటీవల యూఎస్ డాలర్, బాండ్ ఈల్డ్స్ డిమాండ్ పెరగడంతో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు మాత్రం అవి వరుసగా గరిష్ఠ స్థాయిల నుంచి దిగొస్తుండగా, గ్లోబల్ మార్కెట్లో బంగారం, వెండి రేట్లు పుంజుకుంటున్నాయి. దీంతో ఇంటర్నేషనల్ మార్కెట్ ధరలకు అనుగుణంగానే దేశీయంగా కూడా రేట్లు పుంజుకుంటున్నాయి. భారతదేశంలో ఏయే అంశాలు బంగారం ధరల్ని ప్రభావితం చేస్తాయి?నేరుగా అంతర్జాతీయ మార్కెట్ బంగారం ధరలు, దేశీయంగా నేరుగా ప్రభావం చూపిస్తాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతాయి. అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గుతాయి. ఇంకా ద్రవ్యోల్బణం, రూపాయి విలువ హెచ్చుతగ్గులు, ఫెడ్ వడ్డీ రేట్లు, ఇతర కేంద్ర బ్యాంకుల నిర్ణయాలు, ప్రభుత్వాలు విధించే సుంకాలు బంగారం, వెండి ధరల్ని ప్రభావితం చేస్తుంటాయి.

# కాంగ్రెస్ లో పతాక స్థాయికి చేరిన కుమ్ములాటలు

హైదరాబాద్, : తెలంగాణలో మరోసారి అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్న వేళ, సొంత పార్టీలోనే అసమ్మతి సెగలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి సహజ సిద్ధమైన "అంతర్గత ప్రజాస్వామ్యం" అనే ముసుగులో నేతలు హద్దులు దాటి బహిరంగ విమర్శలకు దిగడం ఇప్పుడు గాంధీభవన్‌ను కుదిపేస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి వంటి సీనియర్ల అసంతృప్తి ఒక ఎత్తయితే, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా ముఖ్యమంత్రినే లక్ష్యంగా చేసుకుని చేసిన తీవ్ర వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.వరంగల్ జిల్లా గీసుకొండ వేదికగా కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని అసలైన ఘర్షణ స్వభావాన్ని బయటపెట్టాయి. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదని, పార్టీ క్రమంగా 'టీడీపీ కాంగ్రెస్'గా మారుతోందంటూ ఆమె నేరుగా సిద్ధాంతపరమైన దాడికి దిగారు. పరకాల టికెట్ వ్యవహారంలో సీఎం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ, "మాకు టికెట్ నిరాకరించడానికి రేవంత్ రెడ్డి ఎవరు?" అని ప్రశ్నించడం అధిష్టాన స్థాయికి చేరిన అంతర్గత పోరును సూచిస్తోంది. కొడంగల్‌లో గతంలో ఆయన ఓడిపోయిన సందర్భాన్ని, రేవంత్‌ను పీసీసీ అధ్యక్షుడిగా సమర్థించిన గతాన్ని ప్రస్తావిస్తూ స్వతంత్రంగానైనా బరిలోకి దిగుతానని హెచ్చరించడం తీవ్ర స్థాయి ధిక్కారానికి నిదర్శనం.ఈ తిరుగుబాటు కేవలం ఒక్క నియోజకవర్గ టికెట్ పోరు మాత్రమే కాదు. కాంగ్రెస్‌లో ఎప్పటినుంచో రగులుతున్న 'వలస నేతలు వర్సెస్ ఒరిజినల్ కాంగ్రెస్' వివాదానికి ఇది పరాకాష్ట. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం దక్కుతోందని, ఉద్యమ కాలం నుంచి పార్టీని మోసిన పాత తరం నేతలు, ముఖ్యంగా బీసీ నాయకత్వం క్రమంగా పక్కకు నెట్టివేయబడుతోందనే అసహనం ఈ వరుస ప్రకటనల్లో స్పష్టంగా వ్యక్తమవుతోంది.మరోవైపు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, క్రమశిక్షణా కమిటీ ఈ పరిణామాలను అదుపు చేయడంలో పూర్తిగా నిస్సహాయంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం, పార్టీ విధానాలపై బహిరంగంగా విరుచుకుపడుతున్న కీలక నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం నాయకత్వ లోపాన్ని, సమన్వయ లేమిని ఎత్తిచూపుతోంది. ఎంపీ మల్లు రవి వంటి సీనియర్లు క్రమశిక్షణపై పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, పాలనాపరమైన సంస్కరణలపై దృష్టి సారిస్తున్న సమయంలో, సొంత క్యాబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అంతర్గత కుమ్ములాటల రూపంలో సాగుతున్న ఈ పరిణామాలు ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు బలమైన రాజకీయ ఆయుధంగా మారుతున్నాయి.పాలనపై ప్రతిపక్షాల విమర్శల కంటే సొంత పార్టీ నేతల అసమ్మతి బాణాలే ప్రభుత్వానికి పెద్ద ముప్పుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఏఐసీసీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని సమన్వయ కమిటీ ద్వారా అసమ్మతి నేతలతో చర్చలు జరపకపోతే లేదా కఠినమైన క్రమశిక్షణా చర్యలు చేపట్టకపోతే, ఈ అంతర్గత విభేదాలు మరింత విస్తరించి ప్రభుత్వ స్థిరత్వానికే పెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# కొండాకు పదవీ గండం...

వరంగల్, : కొండా సురేఖ మంత్రి పదవి తొలగింపుపై రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరేకంగా అందరూ ఒక్కటయ్యారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖ కుటుంబ వ్యవహార శైలిపై పార్టీ హైకమాండ్ కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. అయితే కొండా సురేఖ మీద చర్యలు తీసుకుంటే కట్టుబాటు తప్పిన మిగిలిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే బీసీ కార్డుతో కొండా సురేఖ పార్టీని ఇరకాటంలోకి పెట్టే అవకాశముంది. అందుకే కొండా సురేఖ వ్యవహారాన్ని పరిశీలిస్తున్న నాయకత్వం ఏదో ఒక చర్య మాత్రం తీసుకోవాలని చూస్తుంది.. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కొండా సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు ఆ వ్యాఖ్యలు తన కుమార్తె వ్యక్తిగతమని, తనకూ వాటికి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేస్తూ క్రమశిక్షణా సంఘానికి లేఖ రాశారు.మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేదా అనే అంశంపై పార్టీ హైకమాండ్ మరియు సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది. దళిత ఎమ్మెల్యేను అవమానపర్చిన సమయంలోనూ, ఇతర సామాజికవర్గం నేతలను కించపర్చినప్పుడు ఒక్కటవ్వని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ విషయంలో ఒక్కటవ్వడంపై కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది కానీ కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలంటే అందుకు కొంత పార్టీ సాహసం చేయాల్సి ఉంటుంది. మిగిలిన క్రమశిక్షణ తప్పిన రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే అవి తప్పుడు సంకేతాలు వెళతాయి. తెలంగాణలో బలమైన బీసీ సామాజికవర్గంలో వ్యతిరేకత వస్తే అది రాజకీయంగా ఇబ్బందిగా మారుతుంది. అందుకే కొండా సురేఖ పై చర్యలు అంత సులువు కాదు. కాకుంటే ఇకపై ఎలాంటి దూకుడు గా వ్యవహరించకుండా కొంత కళ్లెం వేయవచ్చన్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. కొండా సురేఖకు వ్యతిరేకంగా పదహారు మంది ఎమ్మెల్యేలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొందరు లోపాయికారీగా కొండాసురేఖకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. మరి కొండా వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందన్నది చూడాలి.

# ఆర్‌బీఐ ప్రణాళికలకు కొత్త సవాళ్లు...




దేశంలో యూపీఐ, డిజిటల్ చెల్లింపుల వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ, చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల పరిమాణం ఏమాత్రం తగ్గకపోవడం ఆర్థికవ్యవస్థలో ఆసక్తికరమైన సవాలుగా మారింది. డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్నా.. నగదుపై ప్రజలు ఆధారపడటం మాత్రం తగ్గడం లేదు. వ్యక్తిగత లావాదేవీల్లో నగదు వాటా క్రమంగా తగ్గుతున్నప్పటికీ, చలామణిలో ఉన్న కరెన్సీ మాత్రం రెండంకెల వేగంతో పెరుగుతుండటం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కి కొత్త సవాలుగా మారింది.

భవిష్యత్తులో ఎంత నగదు అవసరమవుతుందో అంచనా వేయడం, దానికి అనుగుణంగా నోట్లను ముద్రించడం, దేశవ్యాప్తంగా పంపిణీ చేయడం మరింత క్లిష్టంగా మారుతోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ శిరీష్ చంద్ర ముర్ము తెలిపారు. జకార్తాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలు, తక్కువ ఆదాయ వర్గాలు, వృద్ధులు, చిన్న వ్యాపారాల్లో నగదు ఇప్పటికీ కీలక చెల్లింపు సాధనంగానే ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఆర్‌బీఐ ఆరు డినామినేషన్లలో ఏటా 2.8 కోట్ల నుంచి 3 కోట్ల నోట్లను ఉత్పత్తి చేసి, అందులో సుమారు 2.1 కోట్ల నోట్లను పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం భారత్‌లో 1.76 కోట్ల నోట్లు చలామణిలో ఉన్నాయని శిరీష్ చంద్ర చెప్పారు.

తక్కువ విలువైన నోట్ల వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల భారత్‌లో నోట్ల సంఖ్య కూడా సహజంగానే అధికంగా ఉంటుందని ఆయన వివరించారు. అంటే డిజిటల్ పేమెంట్స్ పెరిగినా..

దేశవ్యాప్తంగా నగదును ముద్రించడం, తరలించడం, నిల్వ చేయడం, పాత నోట్లను వెనక్కి తీసుకోవడం వంటి భారీ లాజిస్టిక్స్ వ్యవస్థ మాత్రం కొనసాగాల్సిందే. నోట్ల మన్నికను పెంచి, స్వచ్ఛమైన కరెన్సీని అందించేందుకు గాను 2028 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండి రూ.10, రూ.20 విలువైన 100 కోట్ల పాలిమర్ నోట్లను పైలట్ ప్రాజెక్ట్‌గా చలామణిలోకి తెచ్చేందుకు ఆర్‌బీఐ సిద్ధమవుతోంది. కరెన్సీ రంగానికి అవసరమైన పేపర్ మిల్లులు, ప్రింటింగ్ ప్రెస్‌లు, ఇంక్ యూనిట్లు పూర్తిగా స్వదేశీ యాజమాన్యంలోనే ఉండటం వల్ల అధిక భద్రతా ప్రమాణాలతో నోట్లను ముద్రిస్తున్నారు. భౌతిక కరెన్సీపై ప్రజలకు నమ్మకం నిలబెట్టడమే కీలకమని, పర్యావరణహిత పద్ధతుల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించేలా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందని శిరీష్ చంద్ర స్పష్టం చేశారు.

## అనుమానాస్పద విదేశీ నిధుల బదిలీలపై ఐటీ శాఖ నిఘా

సరైన వ్యాపార కార్యకలాపాలు లేకుండానే విదేశాలకు భారీగా నగదు బదిలీ చేస్తున్న అనుమానస్పద సంస్థలు, వాటి వెనుక ఉన్న వ్యక్తులు, ఈ సంస్థలకు పన్ను ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన చార్టర్డ్ అకౌంటెంట్లపై ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం నిఘా పెట్టింది. భారత భూభాగ సరిహద్దు జిల్లాల్లో ఉంటూ&ఝ విదేశాలకు నిధులు తరలిస్తున్న సంస్థలపైనా ఐటీ విభాగం కన్నేసింది. ఈ సోదాల్లో 394 సంస్థలు (ఇందులో సరిహద్దు రాష్ట్రాల్లో 117 సంస్థలు ఉన్నాయి), వీటికి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన 36 మంది నిపుణులు ఉన్నట్లు ఐటీ విభాగం 'ఎక్స్'లో పేర్కొంది. నకిలీ విరాళాలు ఇచ్చే బోగస్ ఛారిటబుల్ ట్రస్టులపై నిర్వహించిన సోదాల్లో విదేశాలకు నిధులు పంపే దేశవ్యాప్త నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చింది. ఈ సంస్థలు ఐటీ రిటర్నులు దాఖలు చేయకపోవడం లేదా అతి స్వల్ప టర్నోవర్ చూపిస్తున్నాయి. విదేశాలకు పంపే భారీ మొత్తాలకు, వారి వ్యాపార టర్నోవర్‌కు ఏమాత్రం పొంతన లేదు. ఈ సోదాల్లో 394 సంస్థలు (ఇందులో సరిహద్దు రాష్ట్రాల్లో 117 సంస్థలు ఉన్నాయి), వీటికి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన 36 మంది నిపుణులు ఉన్నట్లు ఐటీ విభాగం 'ఎక్స్'లో పేర్కొంది.సరకు రవాణా, సాఫ్ట్‌వేర్ దిగుమతి, కన్సల్టింగ్ సేవల పేరిట నిధులను విదేశాలకు పంపినట్లు చూపినప్పటికీ.. ఈ సంస్థలు పేర్కొన్న చిరునామాల్లో ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదని ప్రాథమిక విచారణలో తేలింది.





## భారత్ వృద్ధి అంచనాను పెంచిన ఇండ్-రా




పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే బలహీన పడుతున్న రూపాయి, వ్యవసాయ రంగాన్ని భయపెడుతున్న 'ఎల్ నినో' సవాళ్ల మధ్య భారత ఆర్థికవ్యవస్థవ్యవస్థపై ఒత్తిడి పెంచే అవకాశం ఉందని ప్రముఖ క్రెడిట్ రేటింగ్ సంస్థ ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్–రా) అంచనా వేసింది.


ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు 6.8 శాతంగా నమోదు కానుందని తెలిపింది. గత మే నెలలో ప్రకటించిన 6.7 శాతం అంచనా కంటే ఈసారి వృద్ధి రేటు 6.8 శాతానికి పెరుగుతుందని పేర్కొంది. ఇటీవల ఆర్‌బీఐ సైతం దేశీయ ఆర్థిక వ్యవస్థ పటిష్టత ఆధారంగా తన వృద్ధి అంచనాను 6.6 శాతం నుండి 6.7 శాతానికి సవరించింది. మొదట బ్యారెల్ ముడి చమురు ధర 95 డాలర్లు ఉంటుందని భావించినప్పటికీ, ఇప్పుడు సగటున 85 డాలర్ల వద్దే ఉండవచ్చని సంస్థ లెక్కగట్టింది. ఇది దేశ వాణిజ్య లోటును తగ్గించి ఉపశమనం కలిగించినప్పటికీ, ఎల్ నినో ప్రభావం వల్ల పెరిగే ఆహార ద్రవ్యోల్బణం ఆ ప్రయోజనాలను పరిమితం చేయవచ్చని ఇండ్–రా ముఖ్య ఆర్థికవేత్త దేవేంద్ర పంత్ వెల్లడించారు. మరోవైపు విదేశీ మార్కెట్లలో రూపాయి విలువ మరింత క్షీణించి ఈ ఆర్థిక సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే సగటున రూ. 93.98కి పడిపోవచ్చని ఇండ్–రా భావిస్తోంది. ఈ క్రమంలో మొదటి నుండి నాలుగు త్రైమాసికాల్లో జీడీపీ వృద్ధి రేటు వరుసగా 6.9 శాతం, 6.6 శాతం, 6.7 శాతం, 6.9 శాతంగా ఉండవచ్చని తెలిపింది.

## రైలు టికెట్ బుకింగ్‌లోకి ఉబెర్ యాప్....




ఇకపై రైలు టిక్కెట్ల కోసం ఒక యాప్, స్టేషన్‌కు వెళ్లే క్యాబ్ కోసం మరో యాప్ ఉపయోగించాల్సిన అవసరం లేదు. ప్రముఖ రైడ్–హెయిలింగ్ దిగ్గజం 'ఉబెర్', ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్ 'ఇక్సిగో'తో చేతులు కలిపి తన యాప్‌లోనే నేరుగా రైలు టిక్కెట్లను బుక్ చేసుకునే సరికొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇక్సిగోకు ఉన్న అడ్వాన్స్‌డ్ ట్రైన్ బుకింగ్ టెక్నాలజీని ఉబెర్ ఉపయోగించుకోనుంది. ప్రయాణికులు ఇప్పుడు ఉబెర్ యాప్ ద్వారానే రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవడంతో పాటు తమ పీఎన్ఆర్ స్టేటస్‌ను సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. ప్రతి సంవత్సరం 740 కోట్లకు పైగా ప్రయాణికులను చేరవేసే భారతీయ రైల్వే రంగాన్ని తమ ప్లాట్‌ఫామ్‌కు అనుసంధానించడం ద్వారా, కస్టమర్ల ప్రయాణాన్ని డిజిటల్‌గా అనుసంధానించడమే తమ లక్ష్యమని ఉబెర్ ఇండియా బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అర్నాబ్ కుమార్ వెల్లడించారు. ఈ సరికొత్త ఫీచర్‌తో ఉబెర్ తన సేవలను కేవలం కార్లు, ఆటోలకు మాత్రమే పరిమితం చేయకుండా ఒకే చోట అన్ని రకాల ప్రయాణ సేవలను అందించే 'మల్టీమోడల్ మొబిలిటీ ప్లాట్‌ఫామ్'గా మార్చింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇక్సిగోకు ఉన్న అడ్వాన్స్‌డ్ ట్రైన్ బుకింగ్ టెక్నాలజీని ఉబెర్ ఉపయోగించుకోనుంది. ప్రయాణికులు ఇప్పుడు ఉబెర్ యాప్ ద్వారానే రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవడంతో పాటు తమ పీఎన్ఆర్ స్టేటస్‌ను సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. ప్రయాణికుడు ఇంటి వద్ద బయలుదేరినప్పటి నుండి గమ్యస్థానం చేరుకునే వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలు అందించడంపైనే తాము దృష్టి పెట్టామని ఇక్సిగో సీఈఓ అలోక్ బాజ్‌పాయ్ స్పష్టం చేశారు. బైక్, ఆటో, క్యాబ్, మెట్రో, ఇంటర్‌సిటీ బస్సులతో పాటు ఇప్పుడు రైలు టిక్కెట్లను కలపడం ద్వారా దేశవ్యాప్తంగా ప్రయాణికులకు 'వన్–స్టాప్' సొల్యూషన్‌గా మారాలని భావిస్తున్నట్టు ఉబెర్ పేర్కొంది.

## కోల్గేట్ ధరల పెంపు....




పశ్చిమాసియాలో కొనసాగ్తున్న యుద్ధ సంక్షోభం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రభావం మన నిత్య జీవితంలో భాగమైన ఓరల్ కేర్ ఉత్పత్తులపై పడనుంది. ముడిసరుకుల వ్యయం పెరగడంతో తమ లాభాలను కాపాడుకునేందుకు కోల్గేట్–పామోలివ్ ఇండియా ధరలను పెంచేందుకు సిద్ధమవుతోంది. సహజంగానే ధరల విషయంలో జాగ్రత్తగా ఉండే సామాన్య వినియోగదారులపై భారం పడకుండా తక్కువ మొత్తంలో పెంపునే అమలు చేస్తున్నామని కోల్గేట్ సీఈఓ, ఎండీ ప్రభా నరసింహన్ వార్షిక ఇన్వెస్టర్ డే మీటింగ్‌లో తెలిపారు. సామాన్యులు ఎక్కువగా కొనుగోలు చేసే రూ. 10, రూ. 20 ప్యాకెట్లలో గతంలో జీఎస్టీ తగ్గింపు సమయంలో పెంచిన అదనపు గ్రామేజ్‌ను ఇప్పటికీ కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. అదే సమయంలో హిందుస్థాన్ యూనిలివర్, సెన్సోడైన్, పతంజలి వంటి కంపెనీల పోటీని తట్టుకుంటూ ప్రధాన బ్రాండ్ల ప్యాకేజింగ్, ఉత్పత్తి నాణ్యతను మరింత మెరుగుపరచాలని కంపెనీ భావిస్తోంది.

ఒకవైపు ముడిసరుకుల వ్యయం పెరుగుతున్నప్పటికీ, ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాలు మొత్తం మార్కెట్ వృద్ధి కంటే ఆరు రెట్లు వేగంగా నమోదు కావడం కోల్గేట్‌కు పెద్ద ఊరటనిస్తోంది. పల్లెల్లో ఆదాయాలు, ఓరల్ హెల్త్‌పై అవగాహన పెరగడం గ్రామీణ విక్రయాలకు అండగా నిలుస్తోంది. అయితే తమ పర్సనల్ కేర్ బ్రాండ్ 'పామోలివ్' అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ఆన్‌లైన్, ఈ–కామర్స్ ఛానెళ్లలో మెరుగుపరిచేందుకు 'బాంబే షేవింగ్ కంపెనీ'తో కోల్గేట్ చేతులు కలిపింది. ద్రవ్యోల్బణ సవాళ్లను ఎదుర్కొంటూనే ఎంపిక చేసిన ధరల పెంపు, ప్రీమియం ఉత్పత్తులు, గ్రామీణ విక్రయాలతో వృద్ధిని సాధించడమే కంపెనీ లక్ష్యంగా కనిపిస్తోంది.

## నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు...!



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, కీలక రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. మార్కెట్ ప్రారంభ సమయానికి సెన్సెక్స్ 249 పాయింట్లు (0.32 శాతం) నష్టపోయి 77,479.16 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 50.70 పాయింట్లు (0.21 శాతం) క్షీణించి 24,236.95 వద్ద కొనసాగుతోంది. మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి రెండు సూచీలు నష్టాల్లోనే ఉన్నాయి. మరోవైపు మార్కెట్ ఒత్తిడిలో ఉన్నప్పటికీ కొన్ని కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభిస్తోంది. వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ షేర్లు టాప్ గెయినర్స్‌గా కొనసాగుతున్నాయి.

## టాటా సన్స్ ఏజీఎం రద్దు




దేశీయ అతిపెద్ద వ్యాపార దిగ్గజమైన టాటా గ్రూప్‌లో తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. సంస్థ నాయకత్వ మార్పు జరుగుతున్న కీలక సమయంలో టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కోరం లేక రద్దు కావడం కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టాటా గ్రూప్ చరిత్రలో ఏజీఎం రద్దవడం ఇదే మొదటిసారి. సర్ రతన్ టాటా ట్రస్ట్ విధించిన కీలకమైన ఆంక్ష వల్ల ప్రతినిధులు హాజరుకాక ఈ సమావేశం రద్దయిందని సమాచారం. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఉన్న ఎన్ చంద్రశేఖరన్ తన పదవిలో కొనసాగేందుకు మొగ్గు చూపకపోవడంతో, తదుపరి అధినేతను ఎన్నుకునే ప్రక్రియను సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ వేగవంతం చేసింది. టాటా సన్స్‌లో దాదాపు 66 శాతం వాటా కలిగిన టాటా ట్రస్ట్స్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న నోయెల్ టాటా, కొత్త ఛైర్మన్ ఎంపికలో అత్యంత కీలక వ్యక్తిగా మారారు. ఇటీవలి బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ గ్రూప్ వ్యాపార వృద్ధి ప్రణాళికలను సమర్పించినప్పుడు, ఎయిర్ ఇండియా, బిగ్‌బాస్కెట్ వంటి విభాగాల్లో వస్తున్న నష్టాలపై నోయెల్ టాటా నేరుగా తన ఆందోళనను వ్యక్తం చేయడం గమనార్హం.

టైటాన్, టాటా స్టీల్ సహా ఆరు కంపెనీల బోర్డుల నుంచి నోయెల్ టాటా వైదొలుగుతున్నప్పటికీ, నామినీలకు మినహాయింపు ఉండటంతో టాటా సన్స్ బోర్డులో డైరెక్టర్‌గా కొనసాగుతారు. సెమీకండక్టర్లు, ఏవియేషన్ వంటి రంగాలలో విస్తరిస్తున్న టాటా గ్రూపునకు ఈ నాయకత్వ మార్పు అత్యంత కీలకంగా మారింది.

# రక్తపోటు సరిగ్గానే చెక్ చేసుకుంటున్నారా?



రక్తపోటు తరచూ ఇంట్లోనో లేక ఆస్పత్రికి వెళ్లో చెక్ చేసుకోవడం నేటి కాలంలో సాధారణం అయిపోయింది. ముఖ్యంగా బీపీ చెకింగ్‌కి చాలా మంది ఇంట్లోనే చెక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తపోటును తనిఖీ చేయడంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దీని వల్ల తప్పుడు రీడింగ్ వస్తుంది. నేటి జీవన శైలి కారణంగా చిన్న వయసులోనే బీపీ, డయాబెటిస్ పలకరిస్తున్నాయి. దీంతో తరచూ వీటిని ఇంట్లోనో లేక ఆస్పత్రికి వెళ్లో చెక్ చేసుకోవడం పరిపాటై పోయింది. ముఖ్యంగా బీపీ చెకింగ్‌కి చాలా మంది ఇంట్లోనే చెక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తపోటును తనిఖీ చేయడంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దీని వల్ల తప్పుడు రీడింగ్ వస్తుంది. జనరల్ ప్రాక్టీషనర్ డాక్టర్ విశాఖ ఖచ్చితమైన రీడింగ్ పొందడానికి అనుసరించే పద్ధతి గురించి చెబుతున్నారు. సాధారణంగా రక్తపోటును తనిఖీ చేసేటప్పుడు తెలిసో.. తెలియకో.. చేసే తప్పులు రీడింగ్‌ను ఎలా పెంచుతాయో లేదా తగ్గిస్తాయో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వివరించారు. శారీరక శ్రమ లేదా భావోద్వేగ ఒత్తిడి తర్వాత వెంటనే రక్తపోటును కొలవడం సాధారణంగా అందరూ చేసే తప్పు. ఇది సిస్టోలిక్ రక్తపోటును తప్పుగా పెంచుతుంది. ఇటువంటి రీడింగ్‌లు వ్యక్తి వాస్తవ బేస్‌లైన్ స్థాయిలను వెల్లడించదు. బీపీ చెకప్ చేసుకునే ముందు ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం మంచిది. చెకప్ సమయంలో కూర్చునే తప్పుడు భంగిమ కూడా రీడింగ్‌ను ప్రభావితం చేస్తుంది. కాళ్ళు అడ్డంగా పెట్టుకుని, వేలాడిస్తూ.. తగినంత వీపు మద్దతు లేకుండా కూర్చున్నప్పుడు రక్తపోటు రీడింగ్‌లు 10 ఎఎఊణ నుంచి 15 ఎఎఊణ వరకు పెరుగుతాయి. రీడింగ్ సమయంలో వీపు భాగం కుదురుగా ఉంచాలి. రెండు పాదాలు నేలపై ఉంచాలనే విషయాలు నిర్ధారించుకోవాలి. ఇలా చేస్తే చెకప్ సక్రమంగా ఉంటుంది. చేయి వేలాడదీయడం లేదా సపోర్ట్ లేకుండా ఉండటం మరొక సాధారణ తప్పు. చేయి గుండె స్థాయి కంటే తక్కువగా ఉంచినట్లయితే తప్పుగా అధిక రక్తపోటు రీడింగ్ వస్తుంది. అదేవిధంగా చేయి చాలా ఎత్తుగా పైకి లేపినా తప్పుగా తక్కువ రీడింగ్ వస్తుంది. చేయి గుండె స్థాయిలో సౌకర్యవంతంగా ఉండేలా ఉంచాలి. ఇది రక్తపోటును కొలవడానికి సరైన భంగిమ. కఫ్ సైజు అనేది రక్తపోటు రీడింగ్‌లను ప్రభావితం చేసే మరో ముఖ్యమైన అంశం. చాలా చిన్నగా ఉన్న కఫ్ తప్పుగా రీడింగ్‌లను పెంచుతుంది. అలాగే పెద్దగా ఉన్న కఫ్ కూడా తప్పుగా తక్కువ రీడింగ్‌కు దారితీస్తుంది. ఖచ్చితమైన కొలత కావాలంటే చేయి చుట్టుకొలతకు తగిన కఫ్‌ను మాత్రమే ఉపయోగించాలి.


# కాలేయం ఆరోగ్యానికి వ్యాయామాలు....



శరీరంలోని ప్రతి భాగం చాలా ముఖ్యమైనది. కానీ ఈ యంత్రం ఇంజిన్ బలహీనంగా మారితే ఏం జరుగుతుంది? మన శరీరంలో కాలేయం ఎంతో ముఖ్యమైది. ఇది శరీరంలోని అతి ముఖ్యమైన, కష్టపడి పనిచేసే అవయవాలలో ఒకటి.

కాలేయం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడటమే కాకుండా శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడానికి కూడా పనిచేస్తుంది. వేయించిన ఆహారాలు, ఒత్తిడి క్రమంగా కాలేయాన్ని బలహీనపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. మందుల సహాయం తీసుకునే ముందు కాలేయాన్ని లోపలి నుండి బలోపేతం చేసే కొన్ని వ్యాయామాల గురించి తెలుసుకుందాం. ఇది కాలేయానికి అత్యంత ప్రభావవంతమైన యోగా ఆసనం అని భావిస్తారు. ఈ ప్రాణాయామంలో వేగంగా గాలి వదులుతూ కడుపు లోపలికి, బయటకు కదిలిస్తూ ఉంటుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. రోజూ 5-10 నిమిషాలు కపలాభతి చేయడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది.

# భోజనం తర్వాత తాంబూలం అలవాటు ఉందా?



పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. భారతీయ సంస్కృతిలో తమలపాకులకు విశేష ప్రాముఖ్యత ఉంది. పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి, దుర్వాసనను తొలగించడానికి, శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడతాయి. అందుకే ఇంట్లో పెద్ద వాళ్లు భోజనం తర్వాత తమలపాకులను నమలుతారు. తమలపాకులలో ఉండే పోషకాలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి బయటపడటానికి కూడా ఇది సహాయపడుతుంది. ప్రతిరోజూ భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది మీ మనసును ప్రశాంతంగా ఉంచి మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్సర్ వంటి తీవ్రమైన సమస్యల నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది.

నోటి దుర్వాసన అనేది చాలా మంది ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య. తమలపాకులను నమలడం వల్ల దుర్వాసన తొలగిపోతుంది. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలో దుర్వాసనకు ప్రధాన కారణమైన హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గిస్తాయి. ఇది అద్భుతమైన సహజ మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది.పంటి నొప్పి, చిగుళ్ళలో రక్తస్రావం వంటి సమస్యలకు తమలపాకులు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. తమలపాకులలో విటమిన్ సి ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో నమలడం వల్ల చిగుళ్ళు బలపడతాయి. దంత సమస్యలు తొలగిపోతాయి. తమలపాకులలో టానిన్లు, ప్రొపేన్ ఉంటాయి. ఇవి శరీరం నుంచి విషాన్ని తొలగించి ఆరోగ్యకరమైన శరీరాన్ని నిర్వహించడంలో సహాయపడతాయి.

# మెంతులు.. ఆరోగ్యానికి అద్భుతం కానీ!




మెంతులు తెలుగు ఇంటి వంటల్లో దాదాపు తప్పనిసరి పదార్థం. జీర్ణక్రియ మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడం, జుట్టు ఆరోగ్యం, చర్మ సౌందర్యం - ఇలా అనేక ఆయుర్వేద గుణాలకు ప్రసిద్ధి చెందిన ఈ చిన్న గింజలు రోజువారీ ఆహారంలో భాగమే. కానీ ఇటీవలి అధ్యయనాలు, నిపుణుల హెచ్చరికలు ఈ మెంతుల వాడకం గురించి కొత్త కోణాన్ని చూపుతున్నాయి. గర్భిణీ స్త్రీలు మెంతులను అధికంగా తీసుకుంటే గర్భస్థ శిశువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మొదటి త్రైమాసంలో మెంతుల్లోని కొన్ని సమ్మేళనాలు గర్భాశయ సంకోచాలను ప్రేరేపించి అకాల గర్భస్రావం రిస్క్‌ను పెంచుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, అతి తక్కువ సందర్భాలలో అరుదైన జన్యు వ్యాధి అయిన మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ బిడ్డకు వచ్చే ప్రమాదం కూడా లేదని అనిపించదు. ఇక రొమ్ము క్యాన్సర్ ఉన్న లేదా రిస్క్‌లో ఉన్న మహిళల విషయంలో మెంతులు మరింత జాగ్రత్త అవసరం చేస్తాయి. మెంతుల్లో ఫైటోఈస్ట్రోజెన్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి, ఇవి శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్‌ను అనుకరిస్తాయి.

# అందుకే పిల్లలను వద్దనుకున్నా...



చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అనుపమ పరమేశ్వరన్, ఇటీవల తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అత్యంత చేదు అనుభవాలను బయటపెట్టి సంచలనం సృష్టించారు. గతంలో తాను ఒక వ్యక్తితో ప్రేమలో ఉన్న సమయంలో అనుభవించిన తీవ్రమైన మానసిక క్షోభను గుర్తుచేసుకుంటూ ఆమె ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ మాట్లాడుతూ.. ఒక మహిళగా, ఒక నటిగా సమాజంలో ఎంతో ధైర్యంగా నిలబడాలని ప్రయత్నించిన తనకు, తన మాజీ ప్రియుడి ప్రవర్తన వల్ల తనపై తనకే సిగ్గుచేటుగా అనిపించే పరిస్థితి వచ్చిందని ఆమె తెలిపారు. ప్రతి నెలా ఒక స్త్రీగా సహజంగా జరిగే పీరియడ్స్ ప్రక్రియను కూడా అతడు చాలా చులకనగా చూసేవాడని వెల్లడించారు. తాను ఏ రోజైనా అతని తప్పులను ప్రశ్నించడానికి ప్రయత్నిస్తే, వెంటనే నీకు పీరియడ్స్ సమయమా లేక ఇంకా రాలేదా అని ప్రశ్నిస్తూ, ఇదంతా కేవలం మూడ్ స్వింగ్స్ వల్ల మాత్రమే అని చాలా తేలిగ్గా కొట్టిపడేసేవాడని చెప్పారు. ప్రతిసారీ ఆ రకమైన వ్యాఖ్యలు విన్నప్పుడు ఒక మహిళగా పుట్టినందుకే కదా ఇలాంటి మాటలు అనిపించుకోవాల్సి వస్తోందని, తన ఉనికిపై తనకే అసహ్యం వేసేదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషపూరితమైన రిలేషన్‌షిప్ వల్ల తన జీవిత లక్ష్యాలు, ఆలోచనలు కూడా పూర్తిగా మారిపోయాయని అనుపమ ఆవేదన చెందారు. చిన్నప్పటి నుంచి తనకు 11 మంది పిల్లలు ఉండాలని ఎంతో ఆశగా కలలు కనేదాన్ని అని, కానీ ఆ వ్యక్తితో గడిపిన రెండేళ్ల కాలం తర్వాత, భవిష్యత్తులో అసలు పిల్లలే వద్దు అనే తీవ్రమైన నిర్ణయానికి వచ్చేలా తన ఆలోచనలను దిగజార్చాడని తెలిపారు. అతడి ప్రవర్తన వల్ల తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయానని, ఆ చేదు జ్ఞాపకాల నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని చెప్పారు. ప్రస్తుతం అనుపమ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# పెళ్లి అయిన హీరోయిన్ల కెరీర్‌ను తాక్కేస్తున్నారు



టాలీవుడ్ స్టార్ బ్యూటీ కాజల్ అగర్వాల్ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ వరుస ఆఫర్లతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఇటీవల ఆమె నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద రాణించలేకపోయినా, ఈ చందమామకున్న క్రేజ్, డిమాండ్ మాత్రం రవ్వంతైనా తగ్గడం లేదు. ప్రస్తుతం దర్శకుడు నితీష్ తివారీ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా విజువల్ వండర్ 'రామాయణ'లో కాజల్ మండోదరి పాత్రలో కనిపించబోతున్నారు. ఈ బిగ్ ప్రాజెక్ట్ షూటింగ్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా, దీపావళి పండుగ కానుకగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది.

అయితే ఈ సినిమా షూటింగ్ హడావుడిలో ఉన్న కాజల్, తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినీ ఇండస్ట్రీలో నటీమణులు ఎదుర్కొంటున్న పరిస్థితులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్ల పట్ల పరిశ్రమ చూపే వివక్షను బయటపెడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగానే సినిమా రంగంలో పురుషులతో పోలిస్తే నటీమణులే ఎక్కువ సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ విషయంలో తనకు కొంత అసంతృప్తి కూడా ఉందని కాజల్ స్పష్టం చేశారు. పరిశ్రమలో ఒక నటికి పెళ్లి కాగానే ఆమె లైఫ్ లేదా కెరీర్ అక్కడితో ముగిసిపోయిందని చాలామంది భావిస్తుంటారని కాజల్ అన్నారు. నటీమణులకు మార్కెట్‌లో మంచి డిమాండ్, క్రేజ్ ఉన్నప్పటికీ.. పెళ్లయ్యాక వారిని ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టి, వారి కెరీర్‌ను అణచివేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని సంచలన నిజాలు వెల్లడించారు. ఇటువంటి వివక్షతతో కూడిన పరిస్థితులు పరిశ్రమలో త్వరలోనే మారాలని కోరారు. ప్రతిభ ఉన్న నటీమణులకు వయస్సు లేదా పెళ్లి అనేవి ఎప్పటికీ అడ్డంకి కాకూడదని, నిజమైన టాలెంట్ ఉన్న నటీమణులు ఏ వయసులోనైనా అద్భుతంగా నటించగలరని కాజల్ పేర్కొన్నారు. ప్రస్తుతం కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి.

# నిజాయితీనే ప్రేక్షకులు గుర్తిస్తారు!



"సోషల్ మీడియా ట్రెండ్‌లను పాటిస్తూ.. ఇతరుల అంచనాలను అందుకోవాలని చేసే ప్రయత్నాలు మనల్ని మనం కోల్పోయేలా చేస్తాయ"ని అంటున్నారు కథానాయిక రష్మిక. ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నా వ్యక్తిగత ప్రయాణంలో ఉన్నది ఉన్నట్లు పంచుకోవడానికి ఎప్పుడూ ఇష్టపడతాను. సామాజిక మాధ్యమాల్లో ప్రేక్షకులు నన్ను చూసేది నిజజీవితంలో నేను ఎలా ఉంటానో దానికి దగ్గరగా ఉంటుంది. ట్రెండ్‌ల ప్రభావానికి లోనవకుండా ఒక నిర్దిష్టమైన ఇమేజ్‌లో ఇమడటానికి ఎక్కువగా ప్రయత్నించనప్పుడు ఇలాంటి సహజమైన వ్యక్తిత్వం వస్తుంది.

బహుశా అదే నేనిలా ఉండడానికి సహాయపడుతుందని భావిస్తున్నా. మనం ఎలా ఉండాలో నిరంతరం చెబుతూ ఉండే ప్రపంచంలో బతుకుతున్నాం. ఇతరుల అంచనాలను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు సోషల్ మీడియా, ట్రెండ్‌లు, అభిప్రాయాలు మనల్ని మనం కోల్పోయేలా చేస్తాయి. అందుకే నా దృష్టిలో సక్సెస్ అంటే ఫర్‌ఫెక్ట్ ఇమేజ్ కాదు.. ఎంత ఎదుగుతున్నా సరే మనం మనలా ఉంటూ ప్రేక్షకులతో నిజాయతీగా ఉండడమే. అలాంటి నిజాయతీని ఎప్పటికైనా ప్రేక్షకులు గుర్తిస్తారు. నటిగా ఉండడం వల్ల అంచనాలు, విమర్శలనేవి సహజం. అందరి అభిప్రాయాలను నియంత్రించలేమని, కానీ వాటికి ఎలా స్పందిస్తామన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంటుందని కాలక్రమేణా తెలుసుకున్నా. నా పనిపై దృష్టి పెట్టడం. వ్యక్తిత్వానికి కట్టుబడి ఉండడం, నా ప్రయాణమే నా గురించి చెప్పేలా చేసుకోవడం నాకు ఇష్టమ"ని అన్నారు. ఇటీవలే 'మైసా' చిత్రీకరణలో గాయపడిన రష్మిక విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'రణబాలి', 'మైసా' చిత్రాలున్నాయి

# మోహన్‌లాల్ జోరు మామూలుగా లేదుగా..



మలయాళ స్టార్ సీనియర్ నటుడు మోహన్ లాల్.. ఇండియా వ్యాప్తంగా ఉన్న ఇతర సీనియర్ స్టార్ హీరోలతో పోలిస్తే అద్భుతమైన జోష్ చూపిస్తున్నారు. ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పి చాలామంది సీనియర్ హీరోలకు షాక్ ఇచ్చారు. మోహన్ లాల్ ఒకే రోజు ఏకంగా ఏడు సినిమాలకు కమిట్ అయ్యారు. వాటిలో జీతూ జోసఫ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాతో పాటు ప్రియదర్శన్, విష్ణు మోహన్, దిలీశ్ పోతన్, సత్యన్, జూడ్ ఆంథనీ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలు ఉన్నాయి. ఇలా ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పడంతో మోహన్ లాల్ తన అభిమానులను వరుస సినిమాలతో అలరించబోతున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పి చాలామంది సీనియర్ హీరోలకు షాక్ ఇచ్చారు. మోహన్ లాల్ ఒకే రోజు ఏకంగా ఏడు సినిమాలకు కమిట్ అయ్యారు. ఇక మోహన్ లాల్ తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో 'ఎగ్జైటింగ్ స్టోరీలతో ఆసక్తికరమైన జర్నీకి సిద్ధమవుతున్నాను' అంటూ పోస్ట్ చేశారు. దీంతో ఆయన నుంచి రాబోయే తదుపరి చిత్రాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింతగా పెరిగింది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com